ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

బుధవారం 18 జూన్ 2025

నకిలీ డీకేటీలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తాం

● కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాజంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొందరు రెవెన్యూ ఉద్యోగులు, ప్రధానంగా విశ్రాంత ఉద్యోగుల్లో కొందరు ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు ఇచ్చినట్లు గుర్తించామని, వారిపై కేసులు నమోదు చేసి చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి వెల్లడించారు. మంగళవారం రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవిని కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు వారు పనిచేసే సమయంలో ఒరిజనల్ డీకేటీ, 1బీ, అడంగల్ దాచుకుని ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు ఇస్తున్నట్లు ఆధారాలు సేకరించామన్నారు. వారిపై బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 97 కింద కేసులు నమోదు చేసి వారి వద్ద ఉన్న ఒరిజనల్ రికార్డులను స్వాధీనం చేసుకుంటామన్నారు. రాజంపేట పట్టణంలో ప్రవహించే చక్రాలమడుగు ప్రాంతంలో దాదాపు 1500 నుంచి 3 వేల మంది నివాసం ఉంటున్నారని, భవిష్యత్‌లో ఎటువంటి ఆక్రమణలు జరగకుండా రాజంపేట సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా మామిడి రైతులను అన్నివిధాల ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పద్మా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పద్మా అవార్డులు (పద్మ విభూషణ్, పద్మభూషణ్, పద్మ శ్రీ)-2026లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈవో సాయిగ్రేస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28 లోపు హార్డ్, సాఫ్ట్ కాపీలను పోస్టు ద్వారా కానీ నేరుగా కానీ స్టెప్ కార్యాలయంలో సమర్పించాలని ఆమె తెలిపారు. అర్హులైన వారి నామినేషన్లను కలెక్టర్ ఆమోదంతో తదుపరి చర్య తీసుకుంటామని, వివరాలకు మేనేజర్ సెల్ నెంబరు 9949298810ను సంప్రదించాల్సిందిగా కోరారు.

వాహనాల దారి మళ్లింపు

కలికిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కలికిరి మీదుగా పీలేరు, తిరుపతి వెళ్లే వాహనాల రాకపోకలకు బుధవారం నుంచి దారి మళ్లించినట్లు కలికిరి పోలీసులు మంగళవారం తెలిపారు. నాలుగు లేన్ల 71వ జాతీయ రహదారి పనుల్లో భాగంగా కలికిరి-పీలేరు మార్గంలో పాత ఎన్‌హెచ్ రోడ్డుపై బోయపల్లె సమీపంలో బ్రిడ్జి వద్ద జరిగే పనుల కారణంగా పాత రోడ్డుపై ఎలాంటి వాహనాలు వెళ్లలేని పరిస్థితి వుందని చెప్పారు. ఈ కారణంగా పీలేరు, తిరుపతి వెళ్లే వాహనదారులు కలికిరి గాంధీ విగ్రహం సర్కిల్ వద్ద కలకడ రోడ్డుపై వెళ్లి, అక్కడి నుంచి సైనిక్ సర్కిల్ బ్రిడ్జి వద్ద ఎడమ వైపు సర్వీసు రోడ్డులో తిరుపతి వెళ్లాలని కోరారు. దాదాపు నెల రోజులలోగా ఈ రాకపోకలు పునరుద్ధరించే అవకాశం లేదని తెలిపారు. తిరుపతి వెళ్లే వాహనాలు తప్పనిసరిగా ఎడమ వైపు (ఉత్తరం వైపు) సర్వీసు రోడ్డులో మాత్రమే వెళ్లాలని, మాదిగపల్లె వద్ద మెయిన్ రోడ్డు మీదకు వెళ్లొచ్చని వివరించారు. అన్ని రకాల భారీ, తేలికపాటి వాహనదారులు దీన్ని గుర్తించాలని కోరారు.



అరాకొర నిర్మాణాలతో దర్శనమిస్తున్న పీలేరు కంకర ఫ్యాక్టరీ లేఅవుట్ కాలనీ



నీటిగుంటను తలపిస్తున్న పునాదులు

జగన్ జమానాలో గూడులేని ప్రతి నిరుపేద సొంతింటి కల సాకారం చేస్తామంటూ ప్రకటనలు గుప్పించారు. ప్రకటనే తడవుగా గుట్టలు, వాగులు, వంకలు, గుండ్లు, ముళ్లపొదలు అల్లుకుపోయిన ప్రాంతాల్లో ఇళ్లు మంజూరు చేశారు. జగనన్న కాలనీల నిర్మాణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించకుండానే పండుగ వాతావరణంలో ఇళ్ల నిర్మాణం అంటూ ప్రకటనలు గుప్పించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, కంకర, ఐరన్, ఇటుకలు తదితర నిర్మాణ సామగ్రి తరలింపు కోసం లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రచార ఆర్భాటంతో నిర్మాణాలు చేపట్టిన జగనన్న కాలనీలు కనీస వసతులకు నోచుకోక సమస్యలకు కేంద్ర బిందువుగా దర్శనమిస్తున్నాయి. ఇళ్ల మంజూరుతో సరిపెట్టుకున్నారు తప్ప కనీస వసతుల కల్పనపై దృష్టి సారించిన దాఖలాలు ఎక్కడా కానరావడం లేదు.

సమస్యల సంద్రంలో..

● గుట్టల్లో ఇళ్లు మంజూరుతో లబ్ధిదారులకు తప్పని ఇక్కట్లు

జగనన్న కాలనీలు

● కానరాని మౌలిక వసతులు

● రోడ్లు, కాలువలు, తాగునీరు, రవాణా వసతి ఎప్పుడు?

● వైసీపీ ప్రభుత్వంలో 11,956 ఇళ్లు మంజూరు

● నిర్మాణాల పూర్తి ఎన్నటికో..!



అస్తవ్యస్తంగా ఉన్న వీధులు

పీలేరురూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గుట్టలు, వాగులు, వంకలు, గుండ్లు, ముళ్లపొదలతో జగనన్న కాలనీలు ఉసూరుమంటున్నాయి. కాలనీ వద్దకు వెళ్లాలంటే రవాణా సౌకర్యం కనుచూపు మేర కానరావడం లేదు. మరోవైపు ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నీటి సౌకర్యం కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఐదేళ్లుగా రోడ్లు, మురుగునీటి కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణ దాఖలాలు లేవు. వేలాది ఇళ్లు మంజూరు చేశామంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప ఒక్క కాలనీలో కూడా నిర్మాణాలు పూర్తి చేసుకున్న దాఖలాలు లేకపోవడం గమనార్హం. వైసీపీ ప్రభుత్వంలో పీలేరు నియోజకవర్గంలో వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. అయితే గూడులేని నిరుపేదల ఇళ్ల నిర్మాణం కోసం ఇచ్చిన ఒకటిన్నర సెంటు స్థలం గుట్టల్లో ఇవ్వడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలు సమస్యలకు కేంద్ర బిందువుగా మారాయి తప్ప జరిగిన అభివృద్ధి శూన్యం. జనం గొంతు తడపడం కోసం తాగునీటి సౌకర్యం కల్పించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. రాత్రివేళల్లో పాముల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుట్టలు, వాగులు, వంకల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో ఏడాది పొడవునా పునాదులు ఊట పడుతున్నాయి. ఆయిల్ సీడ్స్, కంకర ఫ్యాక్టరీ లేఔట్లలో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పునాదుల భద్రత డొల్లగా మారింది. నిత్యం పునాదుల నుంచి నీటి ఊట వెళుతుండడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంజూరైన ఇళ్ల వివరాలు ఇలా ..

పీలేరు మండలంలో 5081 ఇళ్లు మంజూరు కాగా 44 లేఔట్లలో నిర్మాణ పనులు చేపట్టి 1930 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. గుర్రంకొండలో 939 ఇళ్లు మంజూరు కాగా 7 లేఔట్లలో 707 ఇళ్లు నిర్మించారు. కలికిరి మండలంలో 13 లేఔట్లలో 1659 ఇళ్ల నిర్మాణం చేపట్టి 1047 పూర్తి చేశారు. కలకడ మండలంలో 9 లేఔట్లలో 1057 ఇళ్లకు 702 నిర్మాణం పూర్తి చేశారు. కేవీపల్లెలో 6 లేఔట్లలో 1350 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి 1018 నిర్మాణం పూర్తి చేశారు. పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సొంత మండలం వాల్మీకిపురంలో 9 లేఔట్లలో 1870 ఇళ్ల నిర్మాణం చేపట్టి 1345 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. అధికారుల లెక్కల ప్రకారం వైసీపీ ప్రభుత్వంలో పీలేరు నియోజకవర్గానికి 11,956 ఇళ్లు మంజూరు చేశారు. అందులో 6829 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా మరో 4073 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. 54 ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు.

ట్యాంకర్ నీళ్లు రూ.800



కాలనీలో తాగునీటి సౌకర్యం లేనందున నిత్యం నీరు కొనాల్సి వస్తోంది. ట్యాంకర్ రూ.800. ఇలా ఎంతకాలం కొని జీవించగలం. ఆ వీధులు అధ్వానంగా ఉన్నాయి. వర్షం పడితే ఇక ఇళ్ల నుంచి బయటకు రాలేం. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి. అంతా గుట్టే రోడ్డు వేయించాలి.

-భాగ్యమ్మ, కంకర ఫ్యాక్టరీ లేఔట్, పీలేరు

వీధులు అధ్వానం



జగనన్న కాలనీల్లో వీధులు అధ్వానంగా ఉన్నాయి. ఐదేళ్లుగా కాలనీలో ఎలాంటి అభివృద్ధి లేదు. కనీసం సీసీ రోడ్లు కూడా వేయలేదు. ఇంకెప్పుడేస్తారో. అధికారులెవరూ ఇటు రావడం లేదు. వీధిలైట్లు వేయాలి. రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమని జీవిస్తున్నాం. కనీస సౌకర్యాలు కల్పించాలి.

- సంపూర్ణమ్మ, జగనన్న కాలనీ, పీలేరు

రూ.7 కోట్లతో ప్రతిపాదనలు



జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.7 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, రవాణా సౌకర్యం కల్పించాల్సి ఉంది. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. కాలనీల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత.

-రమణయ్య, హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ, పీలేరు

విధులను సక్రమంగా నిర్వహించాలి

● ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి

కురబలకోట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు విధులను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంగళ్లు, చేనేతనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపిల్లల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, వారి ఆలనపాలన సరిగా చూసుకోవాలన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం సకాలంలో అందించాలన్నారు. విద్య, పోషణ వంటి అంశాల్లో మెరుగ్గా పనిచేయడంతో పాటు సమయపాలన, పని వేళలను విధిగా పాటించాలన్నారు. పిల్లలు, పాఠశాల అభివృద్ధికి వారి తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలన్నారు. సీడీపీవో సుజాత, సూపర్‌వైజర్ చంద్రకాంత, మంజుల తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పీడీ ఉమాదేవి

హార్సిలీహిల్స్ సుందరీకరణ...షురూ

● వివిధ సర్కిళ్లలో పనులు చేస్తున్న కార్మికులు



హార్సిలీహిల్స్‌లోని జిడ్డు క్రిష్ణమూర్తి సర్కిల్‌లో స్టీల్‌గ్రిల్ నిర్మాణం

బి.కొత్తకోట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల ఆకర్షణకై సుందరీకరణ పనులు మొదలయ్యాయి. ఇటీవల హిల్స్‌ను సందర్శించిన జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్ పర్యాటకరంగ అభివృద్ధిలో భాగంగా కొండపై అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. పలమనేరు-కుప్పం-మదనపల్లి (పీకేయం) అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ ఆధ్వర్యంలో చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించారు. ప్రధాన కూడళ్లను సుందరీకరించడంతో పాటు, గాలిబండపై సిట్టింగ్ టేబుళ్లు, కొండపై పర్యాటకులు చూడదగిన ప్రదేశాలను అన్నింటినీ కలుపుతూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం, పారిశుధ్యం, పర్యాటకుల రక్షణ, తదితర అంశాలపై దృష్టి పెడతామన్నారు. పనుల కోసం పీకెఎం ఉడాతో పాటు, హిల్స్ టౌన్‌షిప్ కమిటీ, కలెక్టర్ ఖాతాలో నుంచి నిధులను సమకూరుస్తామన్నారు. అందులో భాగంగా ప్రస్తుతానికి హిల్స్ ముఖద్వారంలో వున్న హరితసర్కిల్, జిడ్డు క్రిష్ణమూర్తి సర్కిల్, వివేకానంద విగ్రహం తదితర చోట్ల కార్మికులు పనులు ప్రారంభించారు. వీటిని చూసి పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మిగతా పనులు పూర్తి చేసి హిల్స్ అందాలను పెంచాలని కోరుతున్నారు. మంగళవారం ఈ పనులను మదనపల్లి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సైతం పరిశీలించారు.

సోంపల్లెలో విద్యార్థిని మృతి

● గ్రామంలో తీవ్ర విషాదం



మృతిచెందిన విద్యార్థిని తాజ్విన్‌తాజ్

ములకలచెరువు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపల్లెకు చెందిన ఓ విద్యార్థిని మంగళవారం మృతి చెందింది. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసుల కథనం మేరకు... సోంపల్లెకు చెందిన జమాల్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య మోసిన్, ఒక్కగానొక్క కుమార్తె తాజ్విన్‌తాజ్ ఉన్నారు. కుమార్తె సోంపల్లె స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆరవ తరగతి చదువుతోంది. రోజూలాగే సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఉన్నట్లుండి అస్వస్థతకు గురికావడంతో బాలికను చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తాజ్విన్‌తాజ్(12) మంగళవారం మృతి చెందింది. అయితే బాలిక మృతికి గల కారణాలు స్పష్టంగా తెలియడం లేదు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నరసింహుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి మదనపల్లెలో పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామానికి తరలించారు. ఒక్కగానొక్క కుమార్తె మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోధించారు. ఇదిలా ఉండగా బాలిక మృతికి గల కారణాలు పోస్టుమార్టం నివేదికలో వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

రైతులకు ఖేదం.. ఆర్టీసీకి మోదం!

● కార్గోకు గణనీయంగా పెరిగిన బుకింగ్స్

● అదే దారిలోనే ఆదాయం

6



మామిడి రైతులు ఆందోళన చెందొద్దు

● ప్రభుత్వం అండగా నిలుస్తుంది

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



రైతుల సమస్యలను వింటున్న కలెక్టర్ శ్రీధర్

రైల్వేకోడూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని, సబ్సిడీపై ఆందోళన చెందవద్దని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని మైసూరివారిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న మామిడి యార్డులో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోతాపూరి మామిడికి మద్దతు ధర కిలోకు రూ.4లు ఇస్తుందని, కాయలను పక్వానికి వచ్చిన తర్వాతే రైతులు కోతలు చేసి గుజ్జు పరిశ్రమలకు పంపాలని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర రూ.4 లపై అపోహలు ఉన్నాయని, తామే నేరుగా మామిడి రైతులతో మాట్లాడి వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశామని తెలిపారు. మామిడి యార్డుల్లో వ్యవసాయ, ఉద్యానశాఖలకు చెందిన సిబ్బంది, రెవెన్యూశాఖ సిబ్బంది ఉంటున్నారని తెలిపారు. తోతాపూరి మామిడికాయలు కోతలు పూర్తయ్యే వరకు రూ.4 మద్దతు ధర రైతుల అకౌంట్‌లో పడుతుందన్నారు. చిత్తూరు జిల్లా కలెక్టర్, తాము కలిసి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడినట్లు తెలిపారు. అదేవిధంగా టోకెన్ పద్ధతి ద్వారా తోతాపూరి మామిడి కాయలను గుజ్జు పరిశ్రమలకు సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నామన్నారు. కలెక్టరేట్‌లో తోతాపూరి మామిడి కాయలను పండించే రైతుల కోసం ప్రత్యేక సమాచార కేంద్రం ఏర్పాటు చేసినట్లు వివరించారు. యార్డులో అవకతవకలు జరగకుండా ఉండాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో తోతాపూరి మామిడి 10 వేల హెక్టార్లలో రైతులు పండిస్తున్నారని, ఇప్పటివరకు 50 శాతం కోతలు పూర్తయ్యాయని, 25 వేల మెట్రిక్ టన్నుల కాయలను వివిధ మార్కెట్లకు ఎగుమతి చేశారని తెలిపారు. గత రెండు రోజులుగా 600 మెట్రిక్ టన్నుల వరకు పంట వస్తోందని, ఇందులో 30 శాతం పంటను ఉత్తర భారతదేశం నుంచి వచ్చే వ్యాపారులు గుజరాత్, మహారాష్ట్ర వ్యాపారులు తీసుకునిపోయారని తెలిపారు. ఆగస్టు మొదటి వారం వరకు ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని, ఉద్యానశాఖ ద్వారా ఏయే పంట కోతకు వస్తుందో నిర్ధయించి వాటికి వ్యాపారులతో అనుసంధానం చేయనున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా రైల్వేకోడూరు మార్కెట్ యార్డులో ఉన్న సమస్యలను రైతులు, వ్యాపారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ శెట్టిగుంట దగ్గర ఉన్న గుజ్జు పరిశ్రమ వద్దకు వెళ్లి పరిస్థితులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి, రైల్వేకోడూరు తహసీల్దార్ అమర్‌నాథ్, ఎంపీడీవో నాగార్జునరావు, ఉద్యానశాఖ అధికారి భాస్కర్, మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, జనసేన నాయకులు పగడాల వెంకటేష్, వ్యవసాయ, ఉద్యాన శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలు షురూ!

● జిల్లాలో 90 శాతం మందికి స్థాన చలనం

● ఐదేళ్లు పూర్తయితే తప్పనిసరి

● సొంత మండలానికి చెక్



కలికిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీకి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయడంతో సచివాలయ ఉద్యోగుల్లో అలజడి మొదలైంది. ప్రధానంగా ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత మండలంలో పనిచేసే వీలు లేకుండా బదిలీలు జరగాలని రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ డైరెక్టరేట్ స్పష్టం చేయడంతో చాలా మంది సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన రేగింది. ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారందరికీ బదిలీ తప్పనిసరన్నారు. వాస్తవానికి ఈ నెల 12న సచివాలయాల్లో పోస్టుల హేతుబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయాల రాష్ట్ర డైరెక్టరేట్ సోమవారం బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేశారు. దీనికి సంబంధించి ఒక కార్యాచరణను కూడా ప్రకటించింది. ఈ నెల 15-16 మధ్య ఉద్యోగుల హేతుబద్ధీకరణ వివరాలను తేల్చాలని సూచించింది. 16-18 ఆయా సచివాలయాల్లోని ఖాళీలను గుర్తించనున్నారు. 22-24 మధ్య బదిలీలకు ఉద్యోగుల నుంచి దరఖాస్తులకు అనుమతించారు. 25-29 మధ్య దరఖాస్తుల పరిశీలన అనంతరం దానికి సంబంధించి బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. అభ్యంతరాలేవైనా వుంటే 30న కలెక్టరుకు విన్నవించుకోవచ్చు. అదే రోజు బదిలీలన్నీ పూర్తి చేయాల్సి వుంది. చివరగా జూలై 10లోగా ఉద్యోగుల వివరాలను హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి వుంది.

ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా బదిలీలు

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులందరినీ ఆయా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన బదిలీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకే బదిలీల అధికారం అప్పగించారు. అన్నమయ్య జిల్లాలో మొత్తం 501 సచివాలయాలున్నాయి. ఇందులో 4300 పైచిలుకు ఉద్యోగులు వివిధ రకాల శాఖల కింద పనిచేస్తున్నారు. రేషనలైజేషన్ ప్రక్రియ మేరకు గ్రామ సచివాలయాల ఖాళీలను గుర్తించే బాధ్యతను ఎంపీడీవోలకు, వార్డు సచివాలయాలకు సంబంధించి మున్సిపల్ కమిషనర్లకు అప్పగించారు. కాగా ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత మండలానికి బదిలీ చేయకూడదని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రతిభావంతుల కేటగిరీ కింద వారికి కొన్ని మినహాయింపులిచ్చారు. కంటి చూపు లేనివారు, బుద్ధిమాంద్యం పిల్లలున్న ఉద్యోగులకు సరైన వైద్య సదుపాయాలున్న ప్రాంతాలకు కోరుకుంటే బదిలీ చేసేందుకు అనుమతించారు. 40 శాతం మించి వైకల్యం వున్న వారికి, క్యాన్సర్, బైపాస్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ మార్పిడి తదితర తీవ్ర అనారోగ్య కారణాలుంటే వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇక భార్యా భర్తల కేటగిరీకి కూడా యథావిధిగానే పాత పద్ధతి పాటించనున్నారు.

డైట్ మ్యాగజైన్‌కు రచనలు పంపండి

రాయచోటి టౌన్, జూన్17(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రతి నెలా వెలువరిస్తున్న పత్రికలో ప్రచురణల కోసం జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి వివిధ అంశాలపై రచనలను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక డైట్ విద్యా కేంద్రంలో అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్రికలో విద్యా విషయక విజ్ఞాన అంశాలను ప్రచురిస్తామన్నారు. పాఠశాలల్లో అమలు చేసే వినూత్న పద్ధతులు, సృజనాత్మక బోధన విధానాలను ఈ పత్రిక ద్వారా తెలియజేయవచ్చునన్నారు. అనంతరం పత్రిక ఎడిటర్, సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడు తూ ఉమ్మడి కడప జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పత్రిక కోసం వ్యాసాలు, కవితలు, గేయాలు పంపవచ్చునన్నారు. రచనలు తమ స్వంతమేనని, ఇంతవరకు ప్రచురితం కాలేదని రచనతో పాటు ధ్రువీకరణ పత్రం పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గిరిబాబుయాదవ్, శ్రీనివాసులు, నాగేశ్వర్‌రావు, సుబ్బారెడ్డి, కేదార్నాథ్, రెడ్డెయ్య, మోహన్‌నాయక్, కలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఖేదం.. ఆర్టీసీకి మోదం!

● కార్గోకు గణనీయంగా పెరిగిన బుకింగ్స్
● అదే దారిలోనే ఆదాయం..



పీలేరు ఆర్టీసీ కార్గో కార్యాలయంలో మామిడిపండ్ల పార్శిళ్లు



బస్సులో లోడ్ చేస్తున్న కార్మికుడు

పీలేరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రైతులకు ఈ ఏడాది కాసింత ఖేదం మిగిల్చినా ఆర్టీసీ కార్గో కు మాత్రం మామిడి మోదం కలిగిస్తోంది. దూరప్రాంతాల్లో ఉన్న తమ బంధువులు, స్నేహితులకు మామిడి పండ్లు పంపేందుకు చాలా మంది ఆర్టీసీ కార్గోను ఆశ్రయిస్తుండడంతో ఈ ఏడాది కార్గో ఆదాయం పెరిగింది. గత ఏడాది కంటే ఈ ఏడాది మామిడి బుక్కింగులు ఆశాజనకంగా ఉన్నాయని, ఈ నెల ఆఖరుకు అవి బాగా పెరిగే అవకాశం ఉందని పీలేరులోని కార్గో సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇతర కార్గో సంస్థల కంటే ఆర్టీసీ కార్గోలో ధరలు తక్కువగా ఉండడం, సకాలంలో డెలివరీ చేస్తుండడంతో సాధారణ ప్రజలతోపాటు కొంత మంది ఔత్సాహిక ఉత్పత్తిదారులు కూడా తమ వినియోగదారులను చేరుకోవడానికి ఆర్టీసీ కార్గోను ఎంచుకుంటున్నారు.

రాష్ట్రమంతటా సేవలు

పీలేరు ఆర్టీసీ బస్టాండు నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రధాన పట్టణాలకు కార్గో సేవలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాదులోని కొన్ని ప్రాంతాలు, బెంగళూరులోని మెజెస్టిక్ , చెన్నైలోని మాధవరం బస్టాండులకు పీలేరు నుంచి మామిడి పండ్లను కార్గో ద్వారా పంపవచ్చు. అయితే వీటికి డోర్ డెలివరీ ఉండదు. ఆయా ఊళ్లలో కార్గో కార్యాలయాల వద్దకు వెళ్లి వినియోగదారులే పార్శిళ్లు తీసుకోవాల్సి ఉంటుంది.

పెరిగిన ఆదాయం

మామిడి పండ్లను రవాణా చేయడం ద్వారా ఆర్టీసీకి మామిడి సీజన్‌లో గణనీయమైన ఆదాయం లభిస్తోంది. పీలేరు కార్గో కార్యాలయం ద్వారా గత ఏడాది మే నెలలో రూ.2.81 లక్షల వ్యాపారం జరుగగా ఈ ఏడాది రూ.3.24 లక్షలకు చేరుకుంది. గత ఏడాది జూన్‌లో రూ.2.77 లక్షలు రాగా, ఈ ఏడాది జూన్ 15వ తేదీ నాటికే రూ.2.58 లక్షలు వచ్చాయి.

మామిడి రవాణా ధరలు ఇలా..

పీలేరు నుంచి 60 కిలోమీటర్లకు 25 కేజీలకు రూ.70లు, 25 నుంచి 50 కేజీలకు రూ. 100లు రుసుము వసూలు చేస్తున్నారు. 60 కిలో మీటర్లు దాటిన తరువాత 10 కేజీలకు రూ.90లు, ఆ తరువాత ప్రతి 10 కేజీలకు రూ.30ల నుంచి రూ. 40లు అధికంగా చార్జ్ చేస్తారు. మనం ఎంచుకున్న పట్టణానికి డైరెక్టు బస్సు లేకపోతే రూ.30 నుంచి రూ.40 అదనంగా వసూలు చేస్తారు.

డెలివరీ పద్ధతి బాగుంది



ఆర్టీసీ కార్గో ద్వారా పంపుతున్న మామిడి పండ్లు వినియోగదారులకు సకాలంలో అందుతున్నాయి. తద్వారా మాపై నమ్మకం పెరిగి వ్యాపారం కూడా పెరిగింది. ఇతర కార్గో సంస్థల కంటే రవాణా చార్జీలు కూడా తక్కువగా ఉన్నాయి.

- ధర్మారెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, పులిచెర్ల

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఊళ్లకు పీలేరు నుంచి కార్గో సేవలు అందిస్తున్నాం. రైతులు, సాధారణ ప్రజలు ఆర్టీసీ కార్గోను ఉపయోగించుకుని తమ బంధువులు, స్నేహితులకు మామిడి పండ్లను సురక్షితంగా పంపుకోవచ్చు. పచ్చి సరుకు కావడంతో డోర్ డెలివరీ ఇవ్వలేకపోతున్నాం.

- జావెద్, కార్గో ఆపరేటర్

ఎర్రచందనం స్వాధీనం



ద్విచక్రవాహనంతోపాటు ఎర్రచందనం దుంగలతో ఫారెస్ట్ అధికారులు

పీలేరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంతో సహా రూ. 2.50 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో ఎం. గురుప్రభాకర్ తెలిపారు. మంగళవారం పీలేరు ఫారెస్ట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు సోమల మండలం కందూరు వద్ద ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం తెల్లవారు జామున కలికిరి వైపు నుంచి అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం సోమలవైపు వెళ్లిందన్నారు. దానిని వెంబడించగా సోమల సమీపంలో రోడ్డుపక్కన వాహనాన్ని ఆపి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు పారిపోయారని తెలిపారు. వాహనంపై రెండు గోనె సంచుల్లో ఉన్న 34 కిలోల ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దిచక్ర వాహనంతోపాటు ఎర్రచందనం దుంగలను పీలేరు ఫారెస్ట్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎఫ్‌వో తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్ఎస్‌వో ప్రకాష్, ఎఫ్‌బీవో ప్రతాఫ్, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి



బావిలో వృద్ధురాలి మృతదేహం

రామసముద్రం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ నీళ్లలేని బావిలో పడి భిక్షాటన చేసుకునే రెడ్డెమ్మ(65) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని చెన్నారెడిపల్లెకు చెందిన ఆదెప్ప భార్య రెడ్డెమ్మ కొన్నేళ్లుగా చెంబకూరులో ఉంటూ భిక్షాటనతో జీవించేది. ఈమెకు మద్యం తాగే అలవాటు ఉండేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రెడ్డెమ్మ మంగళవారం ఉదయం చెంబకూరు సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహన్ని బావిలో నుండి వెలికి తీసి, పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

రామసముద్రం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కాప్పల్లెకు చెందిన సంతోష్ భార్య అహల్య(27) కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వెంటనే ఆమెను మదనపల్లె ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాయచోటిటౌన్, జూన్17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సోమవారం అర్ధరాత్రి అనంతరం హస్పిటల్ సిబ్బంది మృతదేహన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అర్బన్ ఎస్ఐ విష్ణువర్ధన్ మృతదేహన్ని మార్చురీకి తరలించారు. తల, ముఖం చేతిపై రక్తగాయాలు ఉండడంతో ఇక్కడే చంపారా, బయట చంపి ఇక్కడికి తీసుకొచ్చి పడేశారా అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి మైనారిటీ వర్గానికి చెందిన వాడుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ వెంకటచలపతి తెలియజేశారు.

విద్యుదాఘాతానికి గొర్రెలు బలి



విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన గొర్రెలు

పెద్దతిప్పసముద్రం జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన సెల్ టవర్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఓ నిరుపేదకు చెందిన రెండు గొర్రెలు మృతి చెందాయి. బాధితులు అందించిన సమాచారం మేరకు.. మండలంలోని టి. సదుం పంచాయతీకి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి చెందిన జరాల ఆంజనేయులు అనే వ్యక్తి గొర్రెలు మేపుకుని తన కుటుంబాన్ని పోషిం చుకునే వాడు. మంగళవారం గ్రామ సమీపంలో ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన ఓ సెల్ టవర్ దగ్గర మేపుకుంటుండగా, ఎలాంటి కంచె లేక పోవడంతో సెల్ టవర్ కిందకు వెళ్లిన రెండు గొర్రెలు అక్కడున్న ఎర్త్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. దీంతో సెల్ ట వర్ స్థలం యజమాని వద్దకు వెళ్లి అడగగా తమకు సంబంధం లేదని, విద్యుత్ శాఖ అధికారులను అడగాలని చెబుతున్నారని, విద్యుత్ అధి కారులను అడిగితే, సెల్ టవర్ వాళ్ల చూసుకోవాలని సమాధానం చెబు తున్నారని బాధితుడు వాపోయాడు. ఈ సెల్ టవర్ మెయిన్ రోడ్డు సమీపంలోనే ఉండడంతో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

రెండు కార్లు ఢీ.. నలుగురికి తీవ్ర గాయాలు

పీలేరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఢీకొని నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన పీలేరు - కడప జాతీయ రహదారిలోని జంగంపల్లె క్రాస్ వద్ద చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం శెట్టిపల్లె పంచాయతీ పాళ్యంగడ్డ హరిజనవాడకు చెందిన యాటా చంద్ర, సుబ్బరాయుడు దేవపట్ల నుంచి చెన్నైకి కారులో వెళుతుండగా పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ జంగంపల్లె క్రాస్ వద్ద చెన్నై నుంచి కర్నూలు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో యాటా చంద్ర, సుబ్బరాయుడు, డ్రైవర్ ప్రసన్నకుమార్, ఢీకొన్న వాహనంలో ప్రయాణిస్తున్న ఉదయ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సంఘటనా స్థలం నుంచి 108 వాహనంలో పీలేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో చంద్ర కుడికాలు నుజ్జునుజ్జు కాగా, సుబ్బరాయుడుకు ఎడమచేయి విరిగి, తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పీలేరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడవిపంది మాంసం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న అటవీశాఖ అధికారులు

ములకలచెరువు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అడవి పంది మాంసం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మదనపల్లె ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జయప్రసాద్ రావు, బురకాయలకోట సెక్షన్ ఆఫీసర్ మోబీన్‌తాజ్ తెలిపారు. మండలంలోని బురకాయలకోట, వేపూరికోట, నేరేడుకొండ బీట్లలో అడవి పందులను వేటాడి వాటి మాసం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో అటవీశాఖ అధికారులు ములకలచెరువు మండలం వడ్డిపల్లె సమీపంలో దాడులు నిర్వహించి శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన బాలాజీ(23), స్థానిక రామాపురానికి చెందిన మంజునాథ(30)ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారి నుంచి అడవి పంది మాంసం, వేటాడే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

పిల్లల బాధ్యత నాది..: డీఈవో



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో

ఒంటిమిట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల బాధ్యత నేను తీసుకుంటామనని జిల్లా విద్యాశాఖాధికారి శంషుద్దీన్ హామీ ఇచ్చారు. మండలంలోని చిన్నకొత్తపల్లె గ్రామ ప్రాథమిక పాఠశాలలోని 6, 7, 8 తరగతులను ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ పాఠశాలలు పునఃప్రారంభం నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు. తమ పిల్లలను ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలకు పంపేది లేదని భైరాయించారు. దీంతో మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి శంషుద్దీన్, ఆర్డీవో జాన్‌ఇర్విన్‌లు చిన్నకొత్తపల్లెకు విచ్చేసి తల్లిదండ్రులతో చర్చించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాలను కాపాడుకునేందుకు మీరు చేస్తున్న పోరాటం గొప్ప విషయమన్నారు. అందుకు తాము కూడా అభినందనలు తెలుపుతున్నానన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పాఠశాలల గురించి పట్టించుకునేవారే కరవయ్యారన్నారు. కొద్దిరోజులపాటు ఒంటిమిట్ట పాఠశాలకు పిల్లలను పంపించాలని, త్వరలో చిన్నకొత్తపల్లె పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చే అవకాశం ఉందన్నారు. అప్పుడు తిరిగి మీ పిల్లలు ఈ పాఠశాలకే వస్తారన్నారు. అప్పటి వరకు ఒక్కో విద్యార్థికి ఆటో ఖర్చులకు నెలకు రూ.500 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఆస్తి అంతస్తులు తరుగుతాయని, తరగని ఆస్తి విద్య ఒక్కటేనన్నారు. విద్య ఉంటే వారి కాళ్లపైన వారే నిలబడతారన్నారు. ఈ పాఠశాలను దత్తుకు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని కృష్ణంపల్లె, సింహాద్రిపురం పాఠశాలను కూడా దత్తు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు దామోదర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఐ రఫీ, మండల విద్యాశాఖాధికారి వెంకటసుబ్బయ్య, ఒంటిమిట్ట చెరువు సంఘం వైస్ ఛైర్మన్ కట్టా యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.


యూఈఈయూ రాష్ట్ర కమిటీలో ముగ్గురికి చోటు



కనుపర్తి కిరణ్



ఏవీ రమణ



సుబ్రహ్మణ్యం

రైల్వేకోడూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీలో రైల్వేకోడూరుకు చెందిన ముగ్గురు నాయకులకు చోటు కల్పిస్తూ రాష్ట్ర నాయకత్వం మంగళవారం ప్రకటించింది. ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 11వ రాష్ట్ర స్థాయి మహా సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా నుంచి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కనుపర్తి కిరణ్, రాయచోటి నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఏవీ రమణ, రైల్వేకోడూరు నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడుగా వి. సుబ్రహ్మణ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పదవులు ఇవ్వడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్మికుల కోసం నిరంతరాయంగా పని చేస్తామని తెలిపారు.

బి.కొత్తకోటలో స్థల వివాదం..

● అధికారుల జోక్యంతో నిర్మాణానికి బ్రేక్

బి.కొత్తకోట, జూన్17(ఆంధ్రజ్యోతి): ఎట్టణంలోని బెంగళూరు రోడ్డులో శ్మశానానికి అనుకుని వున్న ఓ స్థలంలో మంగళవారం కొందరు పునాదినిర్మాణం చేపట్టగా, మరోవర్గం అడ్డుతగిలింది. స్థలంపై హక్కు తమదంటే.. తమదంటూ ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. విషయం పోలీసులు, రెవిన్యూ అధికారులకు చేరడంతో సంఘటనాస్థలానికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడారు. సివిల్ సమస్య కాబట్టి న్యాయపరంగా పరిష్కరించుకోవాలని, పట్టణంలో లాఅండ్‌ఆర్డర్ ప్రాబ్లం రాకుండా చూడాలని పోలీసులు ఆదేశించారు. ఎవరికి హక్కుందో తేల్చుకోవాలని, అంతవరకు నిర్మాణం ఆపాలని రెవెన్యూ సిబ్బంది సూచించారు. దీంతో ప్రస్తుతానికి నిర్మాణానికి బ్రేక్‌పడింది. కాగా ఈ స్థల వివాధం పట్టణంలో చర్చనీ యాంశమైంది.

'ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనం విడుదల చేయాలి'

రైల్వేకోడూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన, వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి ఆశాజ్యోతి అయిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సర్వేపల్లి నరసింహ పేర్కొన్నారు. మంగళవారం రైల్వేకోడూరులో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంకాం ఉన్నత వృత్తివిద్యా కోర్సులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లతీఫ్, మదన్మోహన్, దివన్, విజయ్, శ్రీనివాసులు, మదన్‌సాయి, పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

2029 ఎన్నికల్లో జగన్‌కు 'జీరో' సీట్లు

● 'సూపర్ సిక్స్'తో వైసీపీ బ్యాచ్‌కు నిద్ర కరువు ● నియోజకవర్గంలో 27,535 మందికి తల్లికి వందనం ● తంబళ్లపల్లె ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



మాట్లాడుతున్న తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉనికి కోసం ప్రజలను మభ్యపెట్టే విధంగా వ్యవహరిస్తున్న జగన్‌కు 2029 ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాదని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసి తగిన బుద్ధి చెప్పారన్నారు. దాంతో, మళ్ళీ ప్రజల ఆదరణ పొందేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నాడన్నారు. దీంతో ఈ సారి వచ్చే ఎన్నికల్లో వైసీపీకి జీరో సీట్లు వస్తాయన్నారు. సూపర్ సిక్స్‌లో కీలక పథకమైన తల్లికి వందనం పథకం అమలు తో జగన్, వైసీపీ నేతల నోర్లు మూసుకుపోయాయన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ విద్యా వ్యవస్థను సర్వనాశనం చేశాడన్నారు. తంబళ్లపల్లె నియోజవర్గంలో 27,537 మంది ఖాతాల్లో తల్లికి వందనం పథకం నిధులు జమయ్యాయన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన భూముల రీసర్వేలో తప్పులతోపాటు, వివిధ కారణాలతో నియోజకవర్గంలో 3,500 మందికి తల్లికి వందనం నిధులు జమ కాలేదన్నారు. వైసీపీ తప్పులను సరిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికి వచ్చే నెల 5వ తేదీన తల్లికి వందనం అందేలా చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుంటే వైసీపీ నేతలకు నిద్ర పట్టడం లేదన్నారు. అమ్మఒడి కింద కేవలం కుటుంబంలో ఒక్కరికి మాత్రమే నగదు ఇచ్చి ప్రచారం కోసం కోట్లాది రూపాయలు వృధా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, టీడీపీ నేతలు ముత్తకూరు మౌలా, మూగి రవిచంద్ర, విజయ్‌కుమార్, భజంత్రి రామాంజులు, రామకృష్ణమ రాజు, గోపాల్‌రాజు, ఫజులు, ఫాస్టర్ శ్రీనివాసులు, సుబ్బనాయుడు, గాలి నారాయణ, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

'యోగాంధ్ర' విజయవంతం చేయాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర 2025 కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రైల్వేకోడూరు తహసీల్ధార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 21 నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని నిపుణుల పర్యవేక్షణలో భారీ స్థాయిలో నిర్వహించాలని అధికారులను సూచించారు. మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యోగా కోసం అందరికీ అనువైన ప్రదేశాన్ని ఎంచుకోవాలని సూచించారు. అనంతరం మండల రెవెన్యూ అధికారులతో పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్ధార్ అమర్నాథ్, ఎంపీడీవో నాగార్జున, రీసర్వే డీటీ మానస, వీఆర్వోలు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ లో 1500 మందితో యోగా శిక్షణ

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

బి.కొత్తకోట, జూన్17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హార్సిలీహిల్స్ లో ఈనెల 19న యోగా శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. మంగళవారం ఆయన హార్సిలీహిల్స్‌లో పర్యటించారు. యోగా శిక్షణకు సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గవర్నర్ బంగ్లా ముందుభాగంలో ఉన్న ఖాళీస్థలాన్ని ఎంపిక చేశారు. వేదికనిర్మాణం, కార్పెట్లు సరఫరా, వెలుగు మహిళలు, కళాశాల విద్యార్థుల సమీకరణపై తహసీల్దార్ బాబాజాన్, ఏపీఎం రాజేశ్వరి తదితర అధికారులతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగా కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రతి అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలన్నారు. 19న ఉదయం 6.30కి అందరూ హార్సిలీహిల్స్ చేరుకోవాలని ఆదేశించారు. అంతకుమునుపు జిల్లా టూరిజం మేనేజర్ నాగభూషణం హార్సిలీహిల్స్‌కు చేరుకుని మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీ రాజ్, రెవెన్యూ, వెలుగు తదితర శాఖల సిబ్బంది బాధ్యతలపై చర్చించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ తోపాటు ఉన్నతాధికారులు హాజరు కానున్నందున అధికారులందరూ జాగ్రత్తగా పనిచేయాలన్నారు. ఎంపీడీవో కృష్ణవేణి, తహసీల్దార్ బాబాజాన్, ఏపీఎం రాజేశ్వరి, ఆర్ఐ వీరాంజ నేయులు, వీఆర్వో జయరాంరెడ్డి పాల్గొన్నారు.

'తల్లికి వందనం' కోసం తప్పని తిప్పలు

● సచివాలయం చుట్టూ తిరుగుతున్న మహిళలు



సచివాలయంలో జాబితాను పరిశీలిస్తున్న తల్లులు

రైల్వేకోడూరు రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం కింద అందించే నగదు ప్రయోజనం కొంతమంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ కాక పోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉదయం నుంచే కొంతమంది తల్లులు కోడూరు పట్టణంలోని ఐదు గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల వివరాలు పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు, తల్లుల బ్యాంకు ఖాతా వివరాలు సరిగా నమోదు కాకపోవడం, ఆధార్ కార్డుతో బ్యాంకు ఖాతా లింక్ కాకపోవడం వంటి సాంకేతిక లోపాల కారణంగా ఈ సమస్య తలెత్తినట్లు గ్రామ సచివాలయ అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు ఉన్నాయా లేదా అన్న ఆందోళనతో తల్లులు సచివాలయాల వద్ద పరిశీలిస్తున్నారు. జాబితాలో పేరు లేనివారు అర్హులైనప్పటికీ నగదు జమ కానివారు గ్రీవెన్స్ ద్వారా తమ వివరాలను మరలా నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జూలై 5వ తేదీ లోపు తప్పనిసరిగా నగదు బదిలీ అవుతుందని ఎవరూ ఆందోళన చెందవద్దని అధికారులు భరోసా ఇస్తున్నారు. సమస్యను పరిష్కరించుకునేందుకు సంబంధిత అధికారులను సంప్రదించాలని సాంకేతిక సహాయం అవసరమైన వారికి సచివాలయ సిబ్బంది సహకరిస్తారని తెలిపారు. తల్లులు ఓపికగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కారం లభిస్తుందని వారు తెలిపారు.

ఆటో, లారీ ఢీ - తప్పిన ప్రమాదం

గుర్రంకొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆటోను లారీ ఢీకొనడంతో ఆటో నుజ్జునుజ్జుగా మారింది. స్థానిక ఇందిరమ్మ కాలనీ వాసి మస్తాన్ ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. మంగళవారం ఇందిరమ్మ కాలనీ నుంచి ఆటోలో బస్టాండుకు వస్తుండగా మదనపల్లె నుంచి రాయచోటి వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా దెబ్బతినింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ప్రమాదంపై వివరాలను సేకరిస్తునట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.





అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత (మెయిన్) పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం



ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

సన్నబియ్యం... విద్యార్థుల మోములో ఆనందం

- గతంలో ఉడికీఉడకని అన్నం తినలేక అవస్థలు
- లావు బియ్యానికి స్వస్తి పలికిన రాష్ట్ర ప్రభుత్వం

పులివెందుల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందిస్తోంది. గతంలో అందిస్తున్న లావు బియ్యానికి బదులు సన్నబియ్యం అటు హాస్టళ్లకు, ఇటు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి ఇవ్వడంతో విద్యార్థులకు మంచి భోజనం అందుతోంది. లావు బియ్యంతో ఉడికీఉడకని ముద్దముద్దగా భోజనం ఉండేది. ఎంత జాగ్రత్తగా చేసిన అన్నం సరిగా అయ్యేది కాదని ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. వీటన్నిటికి స్వస్తి పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తోంది. ఈ ఏడాది స్కూళ్లు తెరుచుకోగానే జూన్ మొదటి వారంలో ఈ బియ్యాన్ని ఆయా హాస్టళ్లకు, స్కూళ్లకు ప్రభుత్వం సరఫరా చేసింది. జూన్ 12వ తేదీన పాఠశాల పునఃప్రారంభం రోజు నుంచే ప్రారంభించారు. గతంలో స్కూళ్లు ముగిసే నాటికి హాస్టళ్లలో మిగిలిన లావు బియ్యాన్ని స్కూల్ పునఃప్రారంభ సమయంలో వండి వడ్డించేవారు. దాదాపు 50రోజుల పాటు స్కూళ్లకు సెలవులు రావడం, ఆ సెలవుల్లో ఈ బియ్యాన్ని పట్టించుకోకపోవడంతో పురుగుపట్టడం జరిగేది. కొన్నిచోట్ల మిగిలిపోయిన బియ్యంతో అన్నం చేసినపుడు అందులో పురుగులు కూడా వచ్చేవని విద్యార్థులు చెబుతున్నారు. కానీ ఈ ఏడాది హాస్టళ్లలో మిగిలిపోయిన బియ్యాన్ని పూర్తిగా పక్కనపెట్టేసి పునఃప్రారంభమైన రోజు నుంచే కొత్త బియ్యం అది నాణ్యమైన సన్నబియ్యాన్ని విద్యార్థులకు వండి వడిస్తున్నారు. దీంతో హాస్టల్ విద్యార్థుల మోములో చిరునవ్వు కనిపిస్తోంది. తల్లిదండ్రులకు దూరంగా హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు సన్నబియ్యం సరఫరా చేయడం వారికి ఎంతో ఊరటనిస్తోంది. ఈ సందర్భంగా పలు హాస్టళ్లు, స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆంధ్రజ్యోతి పరిశీలించింది. ఈ పరిశీలనలో విద్యార్థుల నుంచి ప్రభుత్వం పట్ల సానుకూల స్పందన లభించింది. ఎప్పుడు లేని విధంగా ఈసారి మాకు ఇళ్లలో మంచి భోజనాన్ని ఇస్తున్నారని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి భోజనంలా ఉంది





ఇపుడు మా స్కూల్లో పెడుతున్న అన్నం ఇంటి భోజనంలా ఉంది. గతంలో ముద్దగా ఉంటూ, ఉడికి ఉడకని అన్నం తినలేక ఇబ్బందులు పడేవాళ్లం. ఇపుడు అన్నం పొడిపొడిగా, రుచికరమైన కూరలతో పాటు గుడ్డు ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

-నిహారిక 10వ తరగతి, సంతోష్ 6వ తరగతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అహోబిలాపురం, పులివెందుల.

'సూర్యఘర్'తో విద్యుత్ బిల్లుల ఆదా

- ట్రాన్స్‌కో ఈఈ హరిసేవ్యానాయక్



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఈఈ హరిసేవ్యానాయక్

చెన్నూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంతో విద్యుత్ బిల్లుల ఆదాతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ హరిసేవ్యానాయక్ అన్నారు. చెన్నూరు సబ్‌స్టేషన్‌లో మంగళవారం సూర్యఘర్‌యోజన పథకంపై ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ప్రస్తుతం అధిక విద్యుత్ బిల్లులు, కోతల సమస్యలన దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ ముందుచూపుతో పీఎంఎస్‌జీవై పథకాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ పథకంలో రూ.2లక్షలు ప్రాజెక్టుకు వ్యయం చేయాల్సి వస్తే అందులో ఒక కిలో వాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్‌కు రూ.60వేలు, 3కిలో వాట్‌కు రూ.70 వేలు వంతున సబ్సిడీ ఉంటుందన్నారు. అలాగే సోలర్ పలకలు ఏర్పాటు చేసిన ఐదేళ్ల వరకు గ్యారంటీ ఉంటుందన్నారు. ఈలోపు చిన్న పాటి సమస్య ఉన్నా, ఏర్పాటు చేయించిన కంపెనీనే ఉచితంగా సర్వీసు మెయింటె నెన్స్ చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు తప్పకండా పీఎంఎస్‌జీవై ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజరు చలపతి, డీఈ వెంకటేశ్వర్లు, సబ్ ఇంజ నీర్లు స్రవంతి, వల్లూరు ఏఈ లావణ్య, స్టెప్ మేనేజరు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఏపీ సీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా 46వేల మంది రైతులకు పెండింగ్‌లో ఉన్న రూ.1018 కోట్లు బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ సీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పశ్చిమ గోదారి జిల్లాలో రూ.296 కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.256 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాలో రూ.131కోట్లు, మిగతా అనేక జిల్లాలో పెండింగ్ బకాయిలు ఉన్నాయన్నారు. జొన్నలకు రూ.76 కోట్లు, రాగులకు రూ.33లక్షలు పెండింగ్ ఉన్నాయని వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సూపర్ సిక్స్ హామీలు 85శాతం అమలు చేశామని కొందరు టీడీపీ నాయకులు అనడం విడ్డూరమన్నారు. సంవ త్సరంలో పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, తల్లికి వందనం మాత్రమే అమలు చేశారన్నారు. నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ముస్లిం మైనార్టీలకు 50ఏళ్లకే పింఛన్, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి పథకాలు అమలు కాలేదన్నారు. అప్పుడే 85శాతం అమలు అయ్యాయని చెప్పడం కరెక్ట్ కాదన్నారు.

4 వారాంతపు ప్రత్యేక రైళ్లు.. మార్చి వరకు పొడిగింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి-నర్సపూర్, జాల్నా- తిరుపతి మార్గాల్లో నడుస్తున్న 4 వారాంతపు ప్రత్యేక రైళ్లను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు దాకా పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. చర్లపల్లి-నర్సపూర్ మార్గంలో నడిచే (07233/07234) ప్రత్యేకరైళ్లు మార్గమధ్యంలో నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయి. అలాగే, జాల్నా-తిరుపతి మార్గంలో నడిచే (07609/07610) ప్రత్యేక రైళ్లకు మార్గమధ్యంలో పార్బార్, సేలు, మాలావత్, పర్బానీ, గంగాకేర్, పర్లి, వైజనాథ్, లాతూర్, ఉద్గిర్, బీదర్, మార్పల్లి, వికారాబాద్, లింగంపల్లి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్ట్ ఉంటుందని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం

లింగాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పట్ల గ్రామంలో మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు పడి మూడు ఎకరాల అరటితోట దగ్ధమైంది. దీనికి డ్రిప్ ల్యాడర్ మొత్తం దగ్ధం కావడంతో రైతు యుగంధర్‌రెడ్డికి రూ.4 లక్షలు నష్టం వాటిల్లింది. ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలు వ్యాపించకుండా అదుపుచేశారు.

నిబంధనలు మార్చి ఉద్యోగాలను ప్రశ్నార్థకం చేస్తున్నారు

- జేఎన్టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆవేదన

పులివెందుల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడూ లేని విధంగా కాంట్రాక్ట్ అగ్రిమెంట్‌లో నిబంధనలు మార్చి తమ ఉద్యోగాలను ప్రశ్నార్థకం చేస్తున్నారని పులివెందుల జేఎన్టీయూలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం తమ సమస్యపై స్థానిక కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. గత పదిహేను సంవత్సరాలుగా కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న తమకు ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా ప్రతి ఏడాది సర్వీసును పునరుద్ధరించేవారన్నారు. అయితే ఈ ఏడాది ఇంటర్వ్యూలు నిర్వహించి యదావిధిగా మా సర్వీస్‌ను పునరుద్ధరించారన్నారు. అయితే ఈనెల 16వ తేదీ కొత్తగా పలు అంశాలను చేర్చి పునరుద్దరించుకోవాలని చెబుతున్నారన్నారు. కొత్తగా ఇచ్చిన అగ్రిమెంట్‌లో వేకెంట్ పొజిషన్‌లో తీసుకోవడం లేదని, ఎటువంటి సమాచారం లేకుండా సర్వీస్ నుంచి తొలగించే హక్కు వారికి ఉన్నట్లు పొందుపరిచారన్నారు. ఎలాంటి అన్యాయం జరిగినా పెద్దలను గాని, న్యాయస్థానాలను గాని ఆశ్రయించకూడదని పొందుపరిచారన్నారు. ఈనిబంధనలు తమకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రిన్సిపాల్ ఏమన్నారంటే..

కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలపై పులివెందుల జేఎన్టీయూ ప్రిన్సిపాల్ విష్ణువర్దన్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అగ్రిమెంట్ చేసుకోవాలని చెప్పామన్నారు. మీ ఉద్యోగ భద్రతకు భంగం కలగదని వివరించామన్నారు. జేఎన్టీయూ పరిధిలో అనంతపురం, పులివెందుల, కలికిరి కళాశాలలు ఉన్నాయని, కేవలం పులివెందులలో మాత్రమే ఇలాంటి నిరసన వ్యక్తమవుతోందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు ముందుకెళ్తామన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

జమ్మలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటలో 18వ తేదీ బుధవారం ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. మంగళవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పాఠశాలల యజమానులు, ఎంఈవోలు, మండల మహిళా సమాఖ్య, ఆర్టీసీ, తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని భారత ప్రధాని నరేంద్రమోడీ ఈనెల 21వ తేదీ శనివారం వైజాగ్‌లో పాల్గొంటున్న సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గండికోటలో ఏర్పాట్లు పూర్తయ్యాయని... నియోజకవర్గంలోని ప్రజలు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కాగా, జమ్మలమడుగు నుంచి ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు కూటమి నాయకులు తెలియజేశారు.

అయిదుగురు మట్కా నిర్వాహకుల అరెస్టు

జమ్మలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని అలంకార్ ఫంక్షన్ హాలు వద్ద మట్కా నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. రాబడిన సమాచారం మేరకు సీఐ లింగప్ప, ఎస్ఐ హైమావతి, సిబ్బంది దాడి చేసి మట్కా ఆడుతున్న వారిని అదుపులోకి తీసు కున్నారు. వారి వద్ద నుంచి రూ.1 ,39,000లు నగదుతో పాటు మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జమ్మలమడుగు పట్టణంలో కానీ, గ్రామాల్లో ఎక్కడైనా మట్కా నిర్వహిస్తున్నా, పేకాట ఆడుతున్నా సమాచారం ఇవ్వాలన్నారు. అలాంటి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ తెలిపారు.

నూనెపంటల సాగుకు ప్రోత్సాహం

- ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి



సాగులో ఉన్న పామాయిల్ చెట్లను చూపుతున్న శ్రీనివాసులరెడ్డి

పోరుమామిళ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నూనె గింజల పంట సాగు చేపట్టేందుకు ఉద్యానశాఖ రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు పోరుమామిళ్ల డివిజన్ ఉద్యానవనశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పామాయిల్ సాగు చేపట్టే రైతులకు హెక్టారుకు ఉచితంగా దాదాపు 29వేలు విలువ కలిగిన మొక్కలను అందజేస్తామన్నారు. అలాగే పంటసాగుకు రూ21 వేలు రాయితీ రూపంలో అందిస్తారన్నారు. పంట తొలి దశలో స్వల్పకాలిక కూరగాయ, పప్పుధాన్య పంటలను అంతర పంటలుగా సాగు చేసుకుంటే... అంతర పంటల సాగుకు సంవత్సరానికి రూ.5250 చొప్పున నాలుగు సంవత్సరాల్లో మరో 21వేల రూపాయలు ప్రభుత్వం రాయితీ రూపంలో అందిస్తుందన్నారు. అదనంగా పంట పొలానికి ఏపీ సూక్ష్మ నీటిపారుదల పథకంలో భాగంగా 90 నుంచి 70 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు అందిస్తుందన్నారు. పొలంలో నీటి వనరుల నిర్వహణ కోసం ఫారంపాండ్ నిర్మాణం చేపడితే మరో రూ.75వేలు రాయితీ ఉంటుందన్నారు. ఇక పండిన పంటను ప్రభు త్వంతో ఒప్పందం కుదుర్చుకుంటే.. కంపెనీనే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు నేరుగా కొనుగోలు చేస్తుందన్నారు. పంట నాటిన నాలుగో సంవ త్సరం నుంచి కోతకు వచ్చి దాదాపు 30 సంవత్సరాల వరకు పంట ఉంటుందన్నారు. వివరాలకు రైతులు రైతు సేవా కేంద్ర సహాయకులకు కానీ, ఉద్యానశాఖాధికారికి కానీ సంప్రదించాలని తెలిపారు.

ఐదుగురు కోడిపందెం రాయుళ్లు అరెస్టు

పులివెందుల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండలంలోని పుత్రాయునిపేట గ్రామ సమీపంలోని పొలాల్లో కోడిపందేలు ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు. మంగళవారం సాయంత్రం పుత్రాయునిపేట సమీపంలోని పొలాల్లో కోడిపందేలు ఆడుతున్నారని సమాచారం అందిన సీఐ తన సిబ్బందితో వెళ్లి ఐదుగురిని అరెస్టు చేశారన్నారు. వారి వద్ద నుంచి రూ.56,350 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

అదుపు తప్పి కాలువలోకి.. దూసుకెళ్లిన కారు



డ్రైనేజీ కాలువలో పడిన కారును బయటకు తీస్తున్న స్థానికులు

జమ్మలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో మంగళవారం సాయంత్రం ఓ కారు అదుపుతప్పి డ్రైనేజీ కాలువలోకి దూసుకెళ్లింది. మున్సిపాలిటీ పరిధిలోని మెయిన్ పోస్టాఫీసుకు వెళ్లే దారిలో ఉన్నట్లుండి ఓ కారు డ్రైనేజీ కాలువలోకి దూసుకు వచ్చింది. ఈ సమయంలో ఎదురుగా ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే స్థానికులు కారును బయటకు తీయడంతో కారులోని వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు

పులివెందుల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జీపుల స్టాండ్ పరిసరాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, బహిరంగ మద్యం తాగినా కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ చాంద్ బాష హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం జీపుల స్టాండ్ వద్ద డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల జీపు స్టాండ్ పరసరాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, బహిరంగ మద్యం తాగుతున్నారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారు ఎవరైన సరే తమకు ఫిర్యాదు చేయాలని ఆయన పేర్కొన్నారు.

నో క్యాష్... నో క్యాష్

- నర్సాపురం ఏపీజీబీలో అందుబాటులో లేని నగదు
- ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు



నర్సాపురంలోని ఏపీజీబీ

కాశినాయన జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నర్సాపు రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో నగదు అందుబాటులో ఉంచకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే మారుమూల మండలం... ఉన్నది ఒకే ఒక బ్యాంక్... నెలలో నాలుగైదు రోజులు మినహా ఎప్పుడు బ్యాంక్‌కు వెళ్లినా అక్కడ సిబ్బంది చెప్పే మాటలు నో క్యాష్. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కో విద్యార్థికి రూ.13000 చొప్పున బ్యాంక్‌లో జమ చేసింది. మరోవైపు రెండు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల డబ్బును విడుదల చేసింది. శని ఆదివారాలు బ్యాంక్‌కు సెలవు కావడంతో సోమ, మంగళవారం బ్యాంక్‌లో రద్దీ పెరిగింది. నగదు కోసం విద్యార్థుల తల్లులు, ఉపాధి కూలీలు బ్యాంక్‌లో క్యూకట్టారు. కానీ అక్కడి సిబ్బంది ముందు చూపుతో నగదు తెచ్చిపెట్టుకోవాల్సింది పోయి యదావిధిగా వచ్చిన వారికి కరోనా సమయంలో చెప్పినట్లు నగదు లేదు అనే రొటీన్ సమాధానమే చెప్పడంతో పలువురు ఖాతాదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఖాతాదారుల కనీస అవసరాలకు డబ్బును సర్దుబాటుచేయకపోతే ఇక బ్యాంక్ ఉండి ఏమి ఉపయోగమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రతినెల 10వ తేదీ వరకు డ్వాక్రా మహిళలు చెల్లించే డబ్బుతో బ్యాంక్‌ను అతికష్టం మీద నడిపిస్తూ వస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా బ్యాంక్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సరిప డు నగదు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు. ఈవిషయంపై బ్యాంక్ మేనేజరు ఇంద్రాణిని వివరణ కోరగా.. నగదు అందుబాటులో లేదన్న విషయం వాస్తవమేనని చుట్టుపక్కల బ్యాంక్ వాళ్లు ఎవరని అడిగినా నగదు ఇవ్వడం లేదన్నారు. దూరప్రాంతనికి పోయి తెచ్చుకుందామంటే ఇబ్బందిగా ఉందన్నారు. ఈవిషయం పైఅధికారులకు కూడా చెప్పానన్నారు.



చాపాడు చానెల్ కాలువ

కేసీ నీటి కోసం...

చాపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో కేసీ కెనాల్ సాగునీటికోసం రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రతి ఏడాది జూన్, జూలై నెలల్లో ఖరీఫ్ పంటలు సాగు చేస్తారు. తొలకరి వానలు కురవగానే భూముల్లో దుక్కులు దున్ని పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతారు. ప్రొద్దుటూరు, చాపాడు, దువ్వూరు, మైదుకూరు, ఖాజీపేట మండలాల్లోని భూములకు ప్రధాన జలవనరు కేసీ కెనాల్ సాగునీరు. మిగిలిన భూములకు వ్యవసాయ ఫిల్టర్లు, బోరుబావులు ప్రధాన ఆధారం. ఈ ఏడాది జూన్ నెల రాగానే రైతులు ఆనందంతో పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి సాగునీరు కేసీ కెనాల్‌కు దాని ఉప కాలువలు అయిన చాపాడు చానెల్, ఏటూరు కాలువలకు అధికారులు నీటిని విడుదల చేస్తారు. ప్రస్తుతం వర్షాలు ఇప్పటికి ఆశించిన స్థాయిలో కురవలేదు. అరకొర వర్షాలు పడడంతో రైతులు దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు. జిల్లాల్లో అన్ని మండలాల్లో కన్నా చాపాడు మండలంలో వరి పైరు ఎక్కువగా సాగు చేస్తారు. ప్రతి ఏడాది సుమారు 26 వేల ఎకరాల్లో వరి, పసుపు 600 ఎకరాల్లో, వేరుశనగ 5 వేల ఎకరాల్లో సాగు చేస్తారు. ప్రొద్దుటూరు మండలంలో సుమారు 5 వేలు, దువ్వూరులో 10 వేల ఎకరాలు, మైదుకూరు, ఖాజీపేట మండలాల్లో 12 వేల ఎకరాల చొప్పున వరి పైరు సాగు చేస్తారు. ఈ మండలాల్లోని రైతులు వరి సాగుకు ముందు పచ్చిరొట్టగా ఉపయోగించే జీలుగ విత్తనాలకోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు అందజేయాలని కోరుతున్నారు. వరి విత్తనాల కోసం నెల్లూరు, నంద్యాల, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళుతున్నారు. రైతులు ఎక్కువగా జిలకర, నెల్లూరు, 999, నంద్యాల, జైశ్రీరాం వంటి రకాలను సాగు చేస్తారు. ప్రతి రోజు మేఘాలతో మబ్బులతో ఊరిస్తోంది తప్ప వర్షం కురవడం లేదు. వర్షం కురిసి కేసీకి సాగునీరు విడుదల చేస్తే పంటలు సాగు చేయవచ్చని రైతులు ఆశగా ఉన్నారు. జూన్, జూలై నెలలు మంచి అదును కాలం. ఈ కాలంలో పంటలు సాగు చేస్తే ఎక్కువగా దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. అందువలనే ఈ సమయంలోనే పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

సాగునీటిని విడుదల చేయాలి



ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్ని గ్రామాల రైతులు పంటలు సాగు చేస్తారు. జూన్ లేదా జూలై నెలలు పంటలు సాగుకు అనుకూలం. ప్రస్తుతం కేసీ కెనాల్‌కు సాగునీటిని విడుదల చేస్తే ఎక్కువ మంది రైతులు వరి సాగు చేస్తారు. ప్రభుత్వం ఆ ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

- ఆస్గాన్, రైతు, గుంత చీపాడు గ్రామం

సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి



ప్రభుత్వం సబ్సిడీకి వరి, వేరుశనగ విత్తనాలు అందజేయాలి. జూన్ లేదా జూలై నెలలు పంటలు సాగు చేసేందుకు మంచి అదును. ఈ కాలంలో పంటలు సాగు చేస్తే ఎక్కువగా దిగుబడి వస్తుంది. అధికారులు విత్తనాలు అందజేసేందుకు చర్యలు చేపట్టాలి.

- సుభద్ర, మహిళా రైతు, కేతవరం గ్రామం

మామిడి రైతుల ఆశలు ఆవిరి

- ధరలు లేక కాయలను తోటల్లోనే వదిలేసిన వైనం
- నీలం, బేనీషా టన్ను రూ.5వేలు మాత్రమే



కొనేవారు లేక మూలన పడేసిన బేనీషా రకం మామిడి

లక్కిరెడ్డిపల్లె జూన్ 17(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లుగా సకాలంలో వర్షాలు లేక ఏ పంట సాగు చేసినా అప్పులే మిగిలాయి. లక్కిరెడ్డిపల్లె మండలంలో వర్షాలు కురిస్తేనే పంటలు పండుతాయి. లేకుంటే కరువే. వర్షాలు కురవక పోవడంతో వేరుశనపంట 80 శాతంమంది రైతులు మానేసి మామిడి తోటలు సాగుచేశారు. ఈ నేపథ్యంలో మండల వ్యాప్తంగా సుమారు 2500 హెక్టార్లులో మామిడి తోటలు సాగుచేశారు. ఎక్కువగా బేనీసా, బెంగుళూరు, నీలం, లాల్బార్, మల్లిక, కేసరి రకాలను సాగుచేశారు. వర్షాలు సక్రమంగా లేక ఎంతో ఖర్చు పెట్టి మామిడి చెట్లను బతికించుకున్నారు. పూత బాగా పూసింది. దీంతో మంచి దిగుబడి వచ్చి అప్పులు తీరుతాయని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ వాతావరణం అనుకూలించక పోవడంతో పంట దిగుబడి అరకొరగా వచ్చింది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు మామిడి కాయల్లో పురుగులు పడ్డాయి. మార్కెట్‌కు తరలిస్తే నీలం, బేనీషా టన్ను రూ.5వేలు మాత్రమే పలుకుతున్నా యని, మిగిలిన రకాలు కూడా అంతంతమాత్రమే ధరలున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టామని, కనీసం ఖర్చులు కూడా రాలేదని రైతులు తెలిపారు. పైగా పురుగులు పడడంతో కాయలు కొయ్యకుండా తోటల్లోనే వదిలేశారు. ఎక్కువగా బి.ఎ్రగుడి, మద్దిరేవుల, పాళెంగొల్లపల్లె, కోనంపేట, దప్పేపల్లె గ్రామాల్లో మామిడి తోటలు కాయలు కొయ్యకుండా తోటల్లోనే వదిలేశారు. కాయలు కోసి దళారుల వద్దకు తీసుకెళితే చాలా అధ్వానంగా అడుగుతున్నారని రైతులు అంటున్నారు. బజారుకు తరలించి విక్రయిస్తే కిలో రూ.10కి అడుగుతున్నారన్నారు. కావున ప్రభుత్వం రైతులకు ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదులకోవాలని రైతులు కోరారు.



తోటలోనే వదిలేసిన బెంగళూరు రకం కాయలు

25 ఎకరాల్లో మామిడి సాగుచేశా



25 ఎకరాల్లో మామిడి తోట సాగుచేశా. దుక్కి నుంచి నూర్పిడి వరకు సుమారు రూ.5 లక్షలు ఖర్చయింది. ధరలు లేకపోవడంతో కనీసం పెట్టుబడి కూడా రావడంలేదు. ప్రతి ఏటా అప్పులే మిగిలుతున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి. - బండ్రెడ్డి శంకర్‌రెడ్డి, రైతు

ధరలు లేక నష్టాలకు విక్రయిస్తున్నాం



తోటలు కొని కాయలు కోసి మహారాష్ట, డిల్లీ, హర్యానా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు తరలించేవాళ్లం. ధరలు లేక అడిగేవారు లేరు పూర్తిగా బేనీషా, నీలం, రకాలు పురుగులు పడుతున్నాయి. ఈ సారి నష్టాలు మిగిలాయి.
- సిద్దయ్య, మామిడి కాయల వ్యాపారి

'వైసీపీ హయాంలో వడ్డెర్లకు ఉపాధి కరువు'

రాయచోటిటౌన్, జూన్17(ఆంధ్రజ్యోతి):వైసీపీ హయాంలో వడ్డెర్లకు ఉపాధి కరువైందని వడ్డెర ప్రజాగళం వ్యవస్థాపక అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన వడ్డెర ప్రజాగళం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు నాగార్జునతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం మైన్స్ డిపార్టుమెంట్‌లో గల వడ్డెర్లు ప్రత్యేక జీవోలతో హక్కులు కలిగి ఉన్నారని, ఆ జీవోలను తొలగించి ఉపాధి లేకుండా చేసిందన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వడ్డెర సొసైటీలకు ఇస్తున్న రాయితీలతో వడ్డెర్ల కొంతమేర ఉపశమనం కలుగుతుందన్నారు. సీనరీస్‌లో వడ్డెర సొసైటీలకు 50 శాతం రాయితీ ఇవ్వడం ద్వారా ఉపాధి కల్పించినట్లయిందన్నారు.

మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డిని కలిసిన నూతన తహసీల్దార్లు



తహసీల్దార్లతో మాట్లాడుతున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూన్17(ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గంలో పలు మండలాలకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన పలువురు తహసీల్దార్లు మంగళవారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి సోదరుడు, నియోజకవర్గ టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డిని కలిశారు. రామాపురం తహసీల్దార్ వెంకటేశ్, లక్కిరెడ్డిపల్లె తహసీల్దార్ క్రాంతికుమార్ లక్ష్మీప్రసాద్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల కొరత



రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

రైల్వేకోడూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల కొరత వేధిస్తోంది. ఇటీవల జరిగిన బదిలీలలో ఇక్కడి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ వంటి కీలకమైన పోస్టు లు ఖాళీ అయ్యాయి. ఇక్కడ త హసీల్దార్‌గా విధులు నిర్వహించిన మహబుబ్ చాంద్ సుండుపల్లికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నిమ్మనపల్లిలో విధులు నిర్వహిస్తున్న అమర్నాథ్ విధుల్లో చేరారు. ఇక్క డి డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ పీలేరుకు బదిలీ అయ్యారు. అలాగే సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఓబులవారిపల్లికి, పుల్లంపేటకు బదిలీపై వెళ్లారు. కాగా ఇక్కడ తహసీల్దార్‌ను మాత్రమే నియమించడంతో తీవ్రమైన ఉద్యోగుల కొర త ఏర్పడింది. దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. వెంటనే ఉద్యోగులను నియమించాలని పలువురు కోరుతున్నారు.

నేడు మండల మీట్

సుండుపల్లె, జూన్17(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రాజమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రేషన్ సక్రమంగా అందించాలి

ఓబులవారిపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలకు రేషన్ సక్రమంగా అందేలా చూడాలని తహసీల్దారు యామినిరెడ్డి డీలర్లకు సూచించారు. నూతన తహసీల్దారు, ఆర్ఐ మల్లికార్జున్‌రెడ్డిని రేషన్ డీలర్లు కలిసి సన్మానిం చారు.

'కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి'

రాజంపేట టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట మండలంలోని నవోదయ కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం రాజంపేట పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు సంఘం జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర ఫిర్యాదు చేశారు. ఆ కోచింగ్ సెంటర్‌లో దాదాపు 60 వేల నుంచి 80 వేల రూపాయలు వసూలు చేసుకుంటూ ఒక్క నవోదయ కోచింగ్ సెంటర్‌ను తన ఇంటి ఆవరణంలోనే ఉంచుకుని మరో కోచింగ్ సెంటర్‌ను కల్యాణమండపంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారని తెలియజేశారు.

విషజ్వరాలపై అధికారులు అప్రమత్తం



బ్లీచింగ్ పిచికారీ చేయిస్తున్న వైద్యాధికారులు

సిద్దవటం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):సిద్దవటం పోలీసులైనులో విషజ్వరాలు ప్రబలినట్లు నిర్ధారణ కావడంతో వైద్యసిబ్బంది అప్రమత్తమయ్యారు. పి.కొత్తపల్లె ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి మంగళవారం మాట్లాడుతూ విషజ్వ రాలు ఉన్న ఇళ్లలో బ్లీచింగ్ పిచికారీ చేయించామన్నారు. దోమలు ఉత్పత్తి చెందకుండా నీటిగుంటల్లో బ్లీచింగ్ పిచికారీ చేశామన్నారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు మాట్లాడుతూ పాత టైర్లు ప్లాస్టిక్ గ్లాసులు, టెంకాయ చిప్పలు తదితర వస్తువుల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. సీహెచ్‌వో లక్ష్మీనరసింహ, సూపర్‌వైజర్‌లు మౌలాలి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చెత్త ద్వారా ఎరువులు తయారు చేయాలి



చెత్త సేకరణ విధానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పుల్లంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : చెత్త ద్వారా ఎరువులు తయారు చేయాలని ఎంపీడీవో శిరీష పేర్కొన్నారు. మండల పరిధిలోని తిప్పాయపల్లె పంచాయతీలో నిర్మించిన చెత్త సంపద కేంద్రాన్ని మంగళవారం శిరీష తనిఖీ చేశారు. ఎలా వినియోగిస్తున్నారు? వేరు చేసిన చెత్తను తొట్లలో ఎలా నింపుతున్నారు అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. చెత్త ద్వారా కృత్రిమ ఎరువులు తయారు చేసి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. అలాగే పంచాయతీలో ఇంటింటికి వెళ్లి గ్రీన్‌అంబాసిడర్ చెత్త ఎలా సేకరిస్తున్నారో పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

'బలిజలను బీసీల్లో చేర్చాలి'



బీసీ రిజర్వేషన్ సాధన కమిటీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

నందలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని బలిజ, తెలగ, కాపు, ఒంటరి కులాలను బీసీ జాబితాలో చేర్చాలని బీసీ రిజర్వేషన్ సాధక కమిటీ నాయకులు సానా ప్రసాద్ డిమాండ్ చేశారు. బలిజలను బీసీ కులాల్లో చేర్చాలంటూ చిత్తూరు నుంచి అమరావతికి 15 మంది బృందంతో బీసీ రిజర్వేషన్ సాధక కమిటీ చేపట్టిన పాదయాత్ర మంగళవారం నందలూరుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో స్థానిక బలిజ నేతలు పాదయాత్రకు స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నేతలు కాంట్రాక్టర్ బుశెట్టి వెంకటసుబ్బయ్యనాగరాజు, ఉప్పుశెట్టి సుధీర్, కొట్టే శ్రీహరి, నారపుశెట్టి శివయ్య, ఉప్పుశెట్టి రెడ్డయ్య, పాటూరు రమేష్, జంగంశెట్టి హరి, బీమా మునుస్వామి, బాలాంజనేయులు, పసుపులేటి సుబ్రమణ్యం, మస్తాన్, శ్రీరాం, హరినాథ్ పాల్గొన్నారు.

వేరుశనగ కాయలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు సబ్సిడీ విత్తనకాయలను అందజేస్తున్న ఏవో రాజకుమారి

లక్కిరెడ్డిపల్లె, జూన్17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో రాజకుమారి, టీడీపీ యువజన మండల నా యకుడు యనమల మదన్‌మోహన్ పేర్కొన్నారు. మంగళవారం దిన్నెపాడు, కస్తూరిరాజుగారిపల్లె గ్రామాల్లో సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ కోసం రైతుకు 50 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలను ప్రభుత్వం సరఫరా చేస్తోందని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో లక్కిరెడ్డిపల్లె మండలానికి 20 క్వింటాళ్ల వేరుశనగ కాయలు మంజూరు చేయించారన్నారు. కందులు, ఉలవలు, అలసందలు, ఆముదాలు సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీహెచ్ బెనర్జీ, పశువైద్యాధికారి మహేశ్, డాక్టర్ ఎస్‌యండీ షఫీనాయక్, జయరాములు, ధర్మరా జు, పీరయ్య, ఓబులేసు, రాజు, నాగేంద్రరాజు, జనార్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత



విద్యార్థుల యోగా శిక్షణను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పుల్లంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు యోగాను దినచర్య చేసుకుంటే ఏకాగ్రతతో పాటు మంచి ఆరోగ్యం పొందవచ్చునని ఎంపీడీవో శిరీషా పేర్కొన్నారు. మంగళవారం ఆమె తిప్పాయపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు చేస్తున్న యోగాను పరిశీలించారు. యోగా వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందన్నారు. పంచాయతీ విస్తరణాధికారి ముత్తయ్య,ప్రధానోపాధ్యాయుడు రామచంద్రయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనకాయలు



సుండుపల్లి: రైతులకు సూచనలు ఇస్తున్న సహాయ సంచాకులు శ్రీలత

సుండుపల్లె, జూన్17(ఆంధ్రజ్యోతి): రైతుల సేవా కేంద్రాల్లో 40 శాతం సబ్సిడీతో రైతులకు ప్రభుత్వం వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తుందని వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీలత తెలిపారు. మంగళవారం సుండుపల్లె 1, 2, 3 రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవకు సంబంధించి ఈకేవైసీ చేసుకోని రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, ముకుందర్, మల్లికార్జున పాల్గొన్నారు.



చిట్వేలి: బొప్పాయ చెట్లను పరిశీలిస్తున్న మండల ఏవో సుధాకర్

చిట్వేలి: మైలపల్లె, పోల్లోపల్లెలో ఏవో సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. సిబ్బంది వీహెచ్‌ఏలు నరసింహ, ఓబయ్యపాల్గొన్నారు.

ఒంటిమిట్ట : వరి సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని ఏవో మంజులరాణి అన్నారు. మంగళవారం గొల్లపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

ఫుట్‌పాత్ ఆక్రమణదారులకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నోటీసులు అందజేస్తున్న కార్యదర్శి సుధాకర్

ఒంటిమిట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట బస్టాండు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన ఆక్రమణదారులకు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 14న ఫుట్‌పాత్‌లను వదలని వ్యాపారులు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించి పంచాయతీ కార్యదర్శి సుధాకర్ మంగళవారం సాయంత్రం బస్టాండుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న మూడు రోజుల్లోపు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని తెలియజేశారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆంధ్ర సౌత్‌జోన్ క్రికెట్ జట్టుకు పూర్విజ



పూర్విజ

నందలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సౌత్‌జోన్ క్రికెట్ జట్టుకు నందలూరు విభ ఎరుడైట్ స్కూల్‌కు చెందిన హనుమంతు పూర్విజ ఎంపికైనట్లు క్రికెట్ సబ్‌సెంటర్ కోచ్‌లు గయాజ్, ఫైరోజ్‌ఖాన్‌లోడిలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ పూర్విజ తన ఫాస్ట్ బౌలింగ్‌తో నెల్లూరు జిల్లాలో జరిగిన జిల్లా క్రికెట్ మ్యాచ్‌లలో నెల్లూరు, అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అన్ని జిల్లాలపై ఎక్కువ వికెట్లు సాధించి అండర్-15 విభాగంలో ఆంధ్ర సౌత్‌జోన్ జట్టుకు ఎంపికైందన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో పుస్తకాల దందా: సీపీఐ

రైల్వేకోడూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల్లో పుస్తకాల దందా సాగుతోందని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి క్రిష్ణచైతన్య తెలిపారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థల్లో పుస్తకాల దందా జరుగుతున్నా జిల్లా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పుస్తకాలను రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠ్యపుస్తకాలకు ధరలు నిర్ణయించినా వాటిని పట్టించుకోకుండా అమ్మకాలు చేస్తున్నారన్నారు. అలాగే స్కూలు బస్సులకు ఫిట్నెస్ టెస్టులు లేవన్నారు. బిల్డింగ్, యూ నిఫాం, స్టడీ తదితర వాటికి ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు.

పేద దళిత, మున్సిపల్ కార్మికుల పిల్లలకు 'తల్లికి వందనం' వర్తింపజేయాలి



వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు

రాయచోటిటౌన్, జూన్17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభు త్వం ప్రకటించిన త ల్లికి వందనం పథ కాన్ని పేద దళిత, మున్సిపల్ కార్మికుల పిల్లలకు కూడా వర్తింపజేయాలని ఏపీ మున్సిపల్ వర్క ర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం వారు మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్పందించి మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులతో పాటు స్కీం వర్లందరికీ తల్లికి వందనంతో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మిక సంఘం నేతలు శేషాద్రి, వెంకటేశ్, కేశవరావు, హరిప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'తో పేద విద్యార్థులకు ఎంతో మేలు

లక్కిరెడ్డిపల్లె, జూన్17(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు తల్లికి వందనం ఎంతో మేలని టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్‌మోహన్, రాజంపేట పార్లమెంట్ డాక్టర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్ అన్నారు. మంగళవారం జొన్నపాడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజర్ సెక్రటరీ డాక్టర్ ధర్మరాజు, సంజీవరాజు, గన్నెపాటి ఓబులేసు, వెంకటసుబ్బయ్య, దూదేకులపల్లి రహీం, నాగరాజు, గంగరాజు, మహిళలు పాల్గొన్నారు.

సిద్దవటం: మండలంలోని లింగంపల్లె ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, సర్పంచ్ చంద్రకళ మాట్లాడుతూ తల్లికి వందనం పథకంతో ప్రతి తల్లికి ఆనందకరంగా ఉందన్నారు. ఎంపీటీసీ ప్రతినిధి శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, పిల్లల తల్లులు విద్యార్థులు పాల్గొన్నారు.

'బీజేపీ పరిపాలనలో ఎంతో అభివృద్ధి'



మాట్లాడుతున్న నాయకులు

పుల్లంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ ఆధ్వర్యంలో బీజేపీ 11 ఏళ్ల అధికారంలో ఎంతో అభివృద్ధి చెందిందని జిల్లా కోకన్వీనర్ తోట శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పుల్లంపేటలో నియోజకవర్గంలోని ఐదు మండలాల బీజేపీ అధ్యక్షులతో ఆయన సమావేశమయ్యారు. 11 ఏళ్ల బీజేపీ పాలనలో సేవా సుపరిపాలన పేదల సంక్షేమం, గ్రామీణ పట్టణాల్లో జరిగిన అభివృద్ధిపై ఈనెల 19 నుంచి మండలాలవారిగా ప్రజలకు తెలియజేసే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

సిద్దవటం ఎన్నికల పరిశీలకుడిగా పులేల

సిద్దవటం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) :అన్నమయ్య జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పులేల రమేష్‌బాబును సిద్దవటం మండల పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా టీడీపీ కేంద్ర కార్యాలయం నియమించినట్లు ఆయన మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజమైన టీడీపీ కార్యకర్తలను నిర్ధారణ చేసి వారికి న్యాయం చేసేవిధంగా సహకరిస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పార్టీ కోసం కష్టపడినవారిని గుర్తించి న్యాయం చేస్తామన్నారు.

డైట్ మ్యాగజైన్‌కు రచనలు పంపండి

రాయచోటి టౌన్, జూన్17(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రతి నెలా వెలువరిస్తున్న పత్రికలో ప్రచురణల కోసం జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి వివిధ అంశాలపై రచనలను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక డైట్ విద్యా కేంద్రంలో అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్రికలో విద్యా విషయక విజ్ఞాన అంశాలను ప్రచురిస్తామన్నారు. పాఠశాలల్లో అమలు చేసే వినూత్న పద్ధతులు, సృజనాత్మక బోధన విధానాలను ఈ పత్రిక ద్వారా తెలియజేయవచ్చునన్నారు. అనంతరం పత్రిక ఎడిటర్, సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడు తూ ఉమ్మడి కడప జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పత్రిక కోసం వ్యాసాలు, కవితలు, గేయాలు పంపవచ్చునన్నారు. రచనలు తమ స్వంతమేనని, ఇంతవరకు ప్రచురితం కాలేదని రచనతో పాటు ధ్రువీకరణ పత్రం పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గిరిబాబుయాదవ్, శ్రీనివాసులు, నాగేశ్వర్‌రావు, సుబ్బారెడ్డి, కేధార్నాధ్, రెడ్డెయ్య, మోహన్‌నాయక్, కలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఖేదం.. ఆర్టీసీకి మోదం!

- కార్గోకు గణనీయంగా పెరిగిన బుకింగ్స్
- అదే దారిలోనే ఆదాయం..


పీలేరు ఆర్టీసీ కార్గో కార్యాలయంలో మామిడిపండ్ల పార్శిళ్లు



బస్సులో లోడ్ చేస్తున్న కార్మికుడు

పీలేరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రైతులకు ఈ ఏడాది కాసింత ఖేదం మిగిల్చినా ఆర్టీసీ కార్గో కు మాత్రం మామిడి మోదం కలిగిస్తోంది. దూరప్రాంతాల్లో ఉన్న తమ బంధువులు, స్నేహితులకు మామిడి పండ్లు పంపేందుకు చాలా మంది ఆర్టీసీ కార్గోను ఆశ్రయిస్తుండడంతో ఈ ఏడాది కార్గో ఆదాయం పెరిగింది. గత ఏడాది కంటే ఈ ఏడాది మామిడి బుక్కింగులు ఆశాజనకంగా ఉన్నాయని, ఈ నెల ఆఖరుకు అవి బాగా పెరిగే అవకాశం ఉందని పీలేరులోని కార్గో సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇతర కార్గో సంస్థల కంటే ఆర్టీసీ కార్గోలో ధరలు తక్కువగా ఉండడం, సకాలంలో డెలివరీ చేస్తుండడంతో సాధారణ ప్రజలతోపాటు కొంత మంది ఔత్సాహిక ఉత్పత్తిదారులు కూడా తమ వినియోగదారులను చేరుకోవడానికి ఆర్టీసీ కార్గోను ఎంచుకుంటున్నారు.

రాష్ట్రమంతటా సేవలు

పీలేరు ఆర్టీసీ బస్టాండు నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రధాన పట్టణాలకు కార్గో సేవలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాదులోని కొన్ని ప్రాంతాలు, బెంగళూరులోని మెజెస్టిక్ , చెన్నైలోని మాధవరం బస్టాండులకు పీలేరు నుంచి మామిడి పండ్లను కార్గో ద్వారా పంపవచ్చు. అయితే వీటికి డోర్ డెలివరీ ఉండదు. ఆయా ఊళ్లలో కార్గో కార్యాలయాల వద్దకు వెళ్లి వినియోగదారులే పార్శిళ్లు తీసుకోవాల్సి ఉంటుంది.

పెరిగిన ఆదాయం

మామిడి పండ్లను రవాణా చేయడం ద్వారా ఆర్టీసీకి మామిడి సీజన్‌లో గణనీయమైన ఆదాయం లభిస్తోంది. పీలేరు కార్గో కార్యాలయం ద్వారా గత ఏడాది మే నెలలో రూ.2.81 లక్షల వ్యాపారం జరుగగా ఈ ఏడాది రూ.3.24 లక్షలకు చేరుకుంది. గత ఏడాది జూన్‌లో రూ.2.77 లక్షలు రాగా, ఈ ఏడాది జూన్ 15వ తేదీ నాటికే రూ.2.58 లక్షలు వచ్చాయి.

మామిడి రవాణా ధరలు ఇలా..

పీలేరు నుంచి 60 కిలోమీటర్లకు 25 కేజీలకు రూ.70లు, 25 నుంచి 50 కేజీలకు రూ. 100లు రుసుము వసూలు చేస్తున్నారు. 60 కిలో మీటర్లు దాటిన తరువాత 10 కేజీలకు రూ.90లు, ఆ తరువాత ప్రతి 10 కేజీలకు రూ.30ల నుంచి రూ. 40లు అధికంగా చార్జ్ చేస్తారు. మనం ఎంచుకున్న పట్టణానికి డైరెక్టు బస్సు లేకపోతే రూ.30 నుంచి రూ.40 అదనంగా వసూలు చేస్తారు.

డెలివరీ పద్ధతి బాగుంది



ఆర్టీసీ కార్గో ద్వారా పంపుతున్న మామిడి పండ్లు వినియోగదారులకు సకాలంలో అందుతున్నాయి. తద్వారా మాపై నమ్మకం పెరిగి వ్యాపారం కూడా పెరిగింది. ఇతర కార్గో సంస్థల కంటే రవాణా చార్జీలు కూడా తక్కువగా ఉన్నాయి.

\- ధర్మారెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, పులిచెర్ల

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఊళ్లకు పీలేరు నుంచి కార్గో సేవలు అందిస్తున్నాం. రైతులు, సాధారణ ప్రజలు ఆర్టీసీ కార్గోను ఉపయోగించుకుని తమ బంధువులు, స్నేహితులకు మామిడి పండ్లను సురక్షితంగా పంపుకోవచ్చు. పచ్చి సరుకు కావడంతో డోర్ డెలివరీ ఇవ్వలేకపోతున్నాం.

\- జావెద్, కార్గో ఆపరేటర్

ఎర్రచందనం స్వాధీనం


ద్విచక్రవాహనంతోపాటు ఎర్రచందనం దుంగలతో ఫారెస్ట్ అధికారులు

పీలేరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంతో సహా రూ. 2.50 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో ఎం. గురుప్రభాకర్ తెలిపారు. మంగళవారం పీలేరు ఫారెస్ట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు సోమల మండలం కందూరు వద్ద ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం తెల్లవారు జామున కలికిరి వైపు నుంచి అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం సోమలవైపు వెళ్లిందన్నారు. దానిని వెంబడించగా సోమల సమీపంలో రోడ్డుపక్కన వాహనాన్ని ఆపి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు పారిపోయారని తెలిపారు. వాహనంపై రెండు గోనె సంచుల్లో ఉన్న 34 కిలోల ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దిచక్ర వాహనంతోపాటు ఎర్రచందనం దుంగలను పీలేరు ఫారెస్ట్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎఫ్‌వో తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్ఎస్‌వో ప్రకాష్, ఎఫ్‌బీవో ప్రతాప్, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి


బావిలో వృద్ధురాలి మృతదేహం

రామసముద్రం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ నీళ్లులేని బావిలో పడి భిక్షాటన చేసుకునే రెడ్డెమ్మ(65) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని చెన్నారెడిపల్లెకు చెందిన ఆదెప్ప భార్య రెడ్డెమ్మ కొన్నేళ్లుగా చెంబకూరులో ఉంటూ భిక్షాటనతో జీవించేది. ఈమెకు మద్యం తాగే అలవాటు ఉండేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రెడ్డెమ్మ మంగళవారం ఉదయం చెంబకూరు సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బావిలో నుండి వెలికి తీసి, పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిల్లల బాధ్యత నాది..: డీఈవో


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో

ఒంటిమిట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల బాధ్యత నేను తీసుకుంటామనని జిల్లా విద్యాశాఖాధికారి శంషుద్దీన్ హామీ ఇచ్చారు. మండలంలోని చిన్నకొత్తపల్లె గ్రామ ప్రాథమిక పాఠశాలలోని 6, 7, 8 తరగతులను ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ పాఠశాలలు పునఃప్రారంభం నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు. తమ పిల్లలను ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలకు పంపేది లేదని భైఠాయించారు. దీంతో మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి శంషుద్దీన్, ఆర్డీవో జాన్‌ఇర్విన్‌లు చిన్నకొత్తపల్లెకు విచ్చేసి తల్లిదండ్రులతో చర్చించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాలను కాపాడుకునేందుకు మీరు చేస్తున్న పోరాటం గొప్ప విషయమన్నారు. అందుకు తాము కూడా అభినందనలు తెలుపుతున్నానన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పాఠశాలల గురించి పట్టించుకునేవారే కరవయ్యారన్నారు. కొద్దిరోజులపాటు ఒంటిమిట్ట పాఠశాలకు పిల్లలను పంపించాలని, త్వరలో చిన్నకొత్తపల్లె పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చే అవకాశం ఉందన్నారు. అప్పుడు తిరిగి మీ పిల్లలు ఈ పాఠశాలకే వస్తారన్నారు. అప్పటి వరకు ఒక్కో విద్యార్థికి ఆటో ఖర్చులకు నెలకు రూ.500 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఆస్తి అంతస్తులు తరుగుతాయని, తరగని ఆస్తి విద్య ఒక్కటేనన్నారు. విద్య ఉంటే వారి కాళ్లపైన వారే నిలబడతారన్నారు. ఈ పాఠశాలను దత్తుకు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని కృష్ణంపల్లె, సింహాద్రిపురం పాఠశాలను కూడా దత్తు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహశిల్దారు దామోదర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఐ రఫీ, మండల విద్యాశాఖాధికారి వెంకటసుబ్బయ్య, ఒంటిమిట్ట చెరువు సంఘం వైస్ ఛైర్మన్ కట్టా యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

2029 ఎన్నికల్లో జగన్‌కు 'జీరో' సీట్లు

- 'సూపర్ సిక్స్'తో వైసీపీ బ్యాచ్‌కు నిద్ర కరువు
- నియోజకవర్గంలో 27,535 మందికి తల్లికి వందనం
- తంబళ్లపల్లె ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి


మాట్లాడుతున్న తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉనికి కోసం ప్రజలను మభ్యపెట్టే విధంగా వ్యవహరిస్తున్న జగన్‌కు 2029 ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాదని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసి తగిన బుద్ధి చెప్పారన్నారు. దాంతో, మళ్ళీ ప్రజల ఆదరణ పొందేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నాడన్నారు. దీంతో ఈ సారి వచ్చే ఎన్నికల్లో వైసీపీకి జీరో సీట్లు వస్తాయన్నారు. సూపర్ సిక్స్‌లో కీలక పథకమైన తల్లికి వందనం పథకం అమలుతో జగన్, వైసీపీ నేతల నోర్లు మూసుకుపోయాయన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ విద్యా వ్యవస్థను సర్వనాశనం చేశాడన్నారు. తంబళ్లపల్లె నియోజవర్గంలో 27,537 మంది ఖాతాల్లో తల్లికి వందనం పథకం నిధులు జమయ్యాయన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన భూముల రీసర్వేలో తప్పులతోపాటు, వివిధ కారణాలతో నియోజకవర్గంలో 3,500 మందికి తల్లికి వందనం నిధులు జమ కాలేదన్నారు. వైసీపీ తప్పులను సరిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికి వచ్చే నెల 5వ తేదీన తల్లికి వందనం అందేలా చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుంటే వైసీపీ నేతలకు నిద్ర పట్టడం లేదన్నారు. అమ్మఒడి కింద కేవలం కుటుంబంలో ఒక్కరికి మాత్రమే నగదు ఇచ్చి ప్రచారం కోసం కోట్లాది రూపాయలు వృధా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, టీడీపీ నేతలు ముత్తకూరు మౌలా, మూగి రవిచంద్ర, విజయ్‌కుమార్, భజంత్రి రామాంజులు, రామకృష్ణమ రాజు, గోపాల్‌రాజు, ఫజులు, పాస్టర్ శ్రీనివాసులు, సుబ్బనాయుడు, గాలి నారాయణ, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

రామసముద్రం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కాప్పల్లెకు చెందిన సంతోష్ భార్య అహల్య(27) కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వెంటనే ఆమెను మదనపల్లె ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాయచోటిటౌన్, జూన్17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సోమవారం అర్ధరాత్రి అనంతరం హాస్పిటల్ సిబ్బంది మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అర్బన్ ఎస్ఐ విష్ణువర్ధన్ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తల, ముఖం చేతిపై రక్తగాయాలు ఉండడంతో ఇక్కడే చంపారా, బయట చంపి ఇక్కడికి తీసుకొచ్చి పడేశారా అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి మైనారిటీ వర్గానికి చెందిన వాడుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ వెంకటచలపతి తెలియజేశారు.

'యోగాంధ్ర' విజయవంతం చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర 2025 కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రైల్వేకోడూరు తహసీల్ధార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 21 నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని నిపుణుల పర్యవేక్షణలో భారీ స్థాయిలో నిర్వహించాలని అధికారులను సూచించారు. మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యోగా కోసం అందరికీ అనువైన ప్రదేశాన్ని ఎంచుకోవాలని సూచించారు. అనంతరం మండల రెవెన్యూ అధికారులతో పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్ధార్ అమర్నాథ్, ఎంపీడీవో నాగార్జున, రీసర్వే డీటీ మానస, వీఆర్వోలు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

యూఈఈయూ రాష్ట్ర కమిటీలో ముగ్గురికి చోటు


కనుపర్తి కిరణ్


ఏవీ రమణ


సుబ్రహ్మణ్యం

రైల్వేకోడూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీలో రైల్వేకోడూరుకు చెందిన ముగ్గురు నాయకులకు చోటు కల్పిస్తూ రాష్ట్ర నాయకత్వం మంగళవారం ప్రకటించింది. ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 11వ రాష్ట్ర స్థాయి మహా సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా నుంచి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కనుపర్తి కిరణ్, రాయచోటి నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఏవీ రమణ, రైల్వేకోడూరు నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడుగా వి. సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పదవులు ఇవ్వడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్మికుల కోసం నిరంతరాయంగా పని చేస్తామని తెలిపారు.

విద్యుదాఘాతానికి గొర్రెలు బలి


విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన గొర్రెలు

పెద్దతిప్పసముద్రం జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన సెల్ టవర్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఓ నిరుపేదకు చెందిన రెండు గొర్రెలు మృతి చెందాయి. బాధితులు అందించిన సమాచారం మేరకు.. మండలంలోని టి. సదుం పంచాయతీకి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి చెందిన జరాల ఆంజనేయులు అనే వ్యక్తి గొర్రెలు మేపుకుని తన కుటుంబాన్ని పోషించుకునే వాడు. మంగళవారం గ్రామ సమీపంలో ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన ఓ సెల్ టవర్ దగ్గర మేపుకుంటుండగా, ఎలాంటి కంచె లేక పోవడంతో సెల్ టవర్ కిందకు వెళ్లిన రెండు గొర్రెలు అక్కడున్న ఎర్త్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. దీంతో సెల్ ట వర్ స్థలం యజమాని వద్దకు వెళ్లి అడగగా తమకు సంబంధం లేదని, విద్యుత్ శాఖ అధికారులను అడగాలని చెబుతున్నారని, విద్యుత్ అధి కారులను అడిగితే, సెల్ టవర్ వాళ్లు చూసుకోవాలని సమాధానం చెబు తున్నారని బాధితుడు వాపోయాడు. ఈ సెల్ టవర్ మెయిన్ రోడ్డు సమీపంలోనే ఉండడంతో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

హార్సిలీహిల్స్ లో 1500 మందితో యోగా శిక్షణ

- సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్


అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

బి.కొత్తకోట, జూన్17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హార్సిలీహిల్స్ లో ఈనెల 19న యోగా శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్ తెలిపారు. మంగళవారం ఆయన హార్సిలీహిల్స్‌లో పర్యటించారు. యోగా శిక్షణకు సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గవర్నర్ బంగ్లా ముందుభాగంలో ఉన్న ఖాళీస్థలాన్ని ఎంపిక చేశారు. వేదికనిర్మాణం, కార్పెట్లు సరఫరా, వెలుగు మహిళలు, కళాశాల విద్యార్థుల సమీకరణపై తహసీల్దార్ బాబాజాన్, ఏపీఎం రాజేశ్వరి తదితర అధికారులతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగా కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రతి అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలన్నారు. 19న ఉదయం 6.30కి అందరూ హార్సిలీహిల్స్ చేరుకోవాలని ఆదేశించారు. అంతకుమునుపు జిల్లా టూరిజం మేనేజర్ నాగభూషణం హార్సిలీహిల్స్‌కు చేరుకుని మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీ రాజ్, రెవెన్యూ, వెలుగు తదితర శాఖల సిబ్బంది బాధ్యతలపై చర్చించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ తోపాటు ఉన్నతాధికారులు హాజరు కానున్నందున అధికారులందరూ జాగ్రత్తగా పనిచేయాలన్నారు. ఎంపీడీవో కృష్ణవేణి, తహసీల్దార్ బాబాజాన్, ఏపీఎం రాజేశ్వరి, ఆర్ఐ వీరాంజ నేయులు, వీఆర్వో జయరాంరెడ్డి పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ.. నలుగురికి తీవ్ర గాయాలు

పీలేరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఢీకొని నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన పీలేరు - కడప జాతీయ రహదారిలోని జంగంపల్లె క్రాస్ వద్ద చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం శెట్టిపల్లె పంచాయతీ పాళ్యంగడ్డ హరిజనవాడకు చెందిన యాటా చంద్ర, సుబ్బరాయుడు దేవపట్ల నుంచి చెన్నైకి కారులో వెళుతుండగా పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ జంగంపల్లె క్రాస్ వద్ద చెన్నై నుంచి కర్నూలు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో యాటా చంద్ర, సుబ్బరాయుడు, డ్రైవర్ ప్రసన్నకుమార్, ఢీకొన్న వాహనంలో ప్రయాణిస్తున్న ఉదయ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సంఘటనా స్థలం నుంచి 108 వాహనంలో పీలేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో చంద్ర కుడికాలు నుజ్జునుజ్జు కాగా, సుబ్బరాయుడుకు ఎడమచేయి విరిగి, తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పీలేరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బి.కొత్తకోటలో స్థల వివాదం..

- అధికారుల జోక్యంతో నిర్మాణానికి బ్రేక్

బి.కొత్తకోట, జూన్17(ఆంధ్రజ్యోతి): ఎట్టణంలోని బెంగళూరు రోడ్డులో శ్మశానానికి ఆనుకుని వున్న ఓ స్థలంలో మంగళవారం కొందరు పునాదినిర్మాణం చేపట్టగా, మరోవర్గం అడ్డుతగిలింది. స్థలంపై హక్కు తమదంటే.. తమదంటూ ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. విషయం పోలీసులు, రెవిన్యూ అధికారులకు చేరడంతో సంఘటనాస్థలానికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడారు. సివిల్ సమస్య కాబట్టి న్యాయపరంగా పరిష్కరించుకోవాలని, పట్టణంలో లాఅండ్‌ఆర్డర్ ప్రాబ్లం రాకుండా చూడాలని పోలీసులు ఆదేశించారు. ఎవరికి హక్కుందో తేల్చుకోవాలని, అంతవరకు నిర్మాణం ఆపాలని రెవెన్యూ సిబ్బంది సూచించారు. దీంతో ప్రస్తుతానికి నిర్మాణానికి బ్రేక్‌పడింది. కాగా ఈ స్థల వివాధం పట్టణంలో చర్చనీ యాంశమైంది.

'తల్లికి వందనం' కోసం తప్పని తిప్పలు

- సచివాలయం చుట్టూ తిరుగుతున్న మహిళలు


సచివాలయంలో జాబితాను పరిశీలిస్తున్న తల్లులు

రైల్వేకోడూరు రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం కింద అందించే నగదు ప్రయోజనం కొంతమంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉదయం నుంచే కొంతమంది తల్లులు కోడూరు పట్టణంలోని ఐదు గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల వివరాలు పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు, తల్లుల బ్యాంకు ఖాతా వివరాలు సరిగా నమోదు కాకపోవడం, ఆధార్ కార్డుతో బ్యాంకు ఖాతా లింక్ కాకపోవడం వంటి సాంకేతిక లోపాల కారణంగా ఈ సమస్య తలెత్తినట్లు గ్రామ సచివాలయ అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు ఉన్నాయా లేదా అన్న ఆందోళనతో తల్లులు సచివాలయాల వద్ద పరిశీలిస్తున్నారు. జాబితాలో పేరు లేనివారు అర్హులైనప్పటికీ నగదు జమ కానివారు గ్రీవెన్స్ ద్వారా తమ వివరాలను మరలా నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జూలై 5వ తేదీ లోపు తప్పనిసరిగా నగదు బదిలీ అవుతుందని ఎవరూ ఆందోళన చెందవద్దని అధికారులు భరోసా ఇస్తున్నారు. సమస్యను పరిష్కరించుకునేందుకు సంబంధిత అధికారులను సంప్రదించాలని సాంకేతిక సహాయం అవసరమైన వారికి సచివాలయ సిబ్బంది సహకరిస్తారని తెలిపారు. తల్లులు ఓపికగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కారం లభిస్తుందని వారు తెలిపారు.

అడవిపంది మాంసం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న అటవీశాఖ అధికారులు

ములకలచెరువు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అడవి పంది మాంసం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మదనపల్లె ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జయప్రసాద్ రావు, బురకాయలకోట సెక్షన్ ఆఫీసర్ మోబీన్‌తాజ్ తెలిపారు. మండలంలోని బురకాయలకోట, వేపూరికోట, నేరేడుకొండ బీట్లలో అడవి పందులను వేటాడి వాటి మాంసం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో అటవీశాఖ అధికారులు ములకలచెరువు మండలం వడ్డిపల్లె సమీపంలో దాడులు నిర్వహించి శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన బాలాజీ(23), స్థానిక రామాపురానికి చెందిన మంజునాథ(30)ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారి నుంచి అడవి పంది మాంసం, వేటాడే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనం విడుదల చేయాలి'

రైల్వేకోడూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన, వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి ఆశాజ్యోతి అయిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సర్వేపల్లి నరసింహ పేర్కొన్నారు. మంగళవారం రైల్వేకోడూరులో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంకాం ఉన్నత వృత్తివిద్యా కోర్సులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లతీఫ్, మదన్మోహన్, దివన్, విజయ్, శ్రీనివాసులు, మదన్‌సాయి, పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, లారీ ఢీ - తప్పిన ప్రమాదం

గుర్రంకొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆటోను లారీ ఢీకొనడంతో ఆటో నుజ్జునుజ్జుగా మారింది. స్థానిక ఇందిరమ్మ కాలనీ వాసి మస్తాన్ ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. మంగళవారం ఇందిరమ్మ కాలనీ నుంచి ఆటోలో బస్టాండుకు వస్తుండగా మదనపల్లె నుంచి రాయచోటి వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా దెబ్బతినింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ప్రమాదంపై వివరాలను సేకరిస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.





అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత (మెయిన్) పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం



ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

సన్నబియ్యం... విద్యార్థుల మోములో ఆనందం

- గతంలో ఉడికీఉడకని అన్నం తినలేక అవస్థలు
- లావు బియ్యానికి స్వస్తి పలికిన రాష్ట్ర ప్రభుత్వం

పులివెందుల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందిస్తోంది. గతంలో అందిస్తున్న లావు బియ్యానికి బదులు సన్నబియ్యం అటు హాస్టళ్లకు, ఇటు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి ఇవ్వడంతో విద్యార్థులకు మంచి భోజనం అందుతోంది. లావు బియ్యంతో ఉడికి ఉడకని ముద్దముద్దగా భోజనం ఉండేది. ఎంత జాగ్రత్తగా చేసిన అన్నం సరిగా అయ్యేది కాదని ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. వీటన్నిటికి స్వస్తి పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తోంది.

ఈ ఏడాది స్కూళ్లు తెరుచుకోగానే జూన్ మొదటి వారంలో ఈ బియ్యాన్ని ఆయా హాస్టళ్లకు, స్కూళ్లకు ప్రభుత్వం సరఫరా చేసింది. జూన్ 12వ తేదీన పాఠశాల పునఃప్రారంభం రోజు నుంచే ప్రారంభించారు. గతంలో స్కూళ్లు ముగిసే నాటికి హాస్టళ్లలో మిగిలిన లావు బియ్యాన్ని స్కూల్ పునఃప్రారంభ సమయంలో వండి వడ్డించేవారు. దాదాపు 50రోజుల పాటు స్కూళ్లకు సెలవులు రావడం, ఆ సెలవుల్లో ఈ బియ్యాన్ని పట్టించుకోకపోవడంతో పురుగుపట్టడం జరిగేది. కొన్నిచోట్ల మిగిలిపోయిన బియ్యంతో అన్నం చేసినపుడు అందులో పురుగులు కూడా వచ్చేవని విద్యార్థులు చెబుతున్నారు. కానీ ఈ ఏడాది హాస్టళ్లలో మిగిలిపోయిన బియ్యాన్ని పూర్తిగా పక్కనపెట్టేసి పునఃప్రారంభమైన రోజు నుంచే కొత్త బియ్యం అది నాణ్యమైన సన్నబియ్యాన్ని విద్యార్థులకు వండి వడిస్తున్నారు. దీంతో హాస్టల్ విద్యార్థుల మోములో చిరునవ్వు కనిపిస్తోంది. తల్లిదండ్రులకు దూరంగా హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు సన్నబియ్యం సరఫరా చేయడం వారికి ఎంతో ఊరటనిస్తోంది. ఈ సందర్భంగా పలు హాస్టళ్లు, స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆంధ్రజ్యోతి పరిశీలించింది. ఈ పరిశీలనలో విద్యార్థుల నుంచి ప్రభుత్వం పట్ల సానుకూల స్పందన లభించింది. ఎప్పుడు లేని విధంగా ఈసారి మాకు ఇళ్లలో మంచి భోజనాన్ని ఇస్తున్నారని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి భోజనంలా ఉంది





ఇపుడు మా స్కూల్లో పెడుతున్న అన్నం ఇంటి భోజనంలా ఉంది. గతంలో ముద్దగా ఉంటూ, ఉడికి ఉడకని అన్నం తినలేక ఇబ్బందులు పడేవాళ్లం. ఇపుడు అన్నం పొడిపొడిగా, రుచికరమైన కూరలతో పాటు గుడ్డు ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

-నిహారిక 10వ తరగతి, సంతోష్ 6వ తరగతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అహోబిలాపురం, పులివెందుల.

'సూర్యఘర్'తో విద్యుత్ బిల్లుల ఆదా

- ట్రాన్స్‌కో ఈఈ హరిసేవ్యానాయక్



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఈఈ హరిసేవ్యానాయక్

చెన్నూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంతో విద్యుత్ బిల్లుల ఆదాతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ హరిసేవ్యానాయక్ అన్నారు. చెన్నూరు సబ్‌స్టేషన్‌లో మంగళవారం సూర్యఘర్‌యోజన పథకంపై ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ప్రస్తుతం అధిక విద్యుత్ బిల్లులు, కోతల సమస్యలన దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ ముందుచూపుతో పీఎంఎస్‌జీవై పథకాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ పథకంలో రూ.2లక్షలు ప్రాజెక్టుకు వ్యయం చేయాల్సి వస్తే అందులో ఒక కిలో వాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్‌కు రూ.60వేలు, 3కిలో వాట్‌కు రూ.70 వేలు వంతున సబ్సిడీ ఉంటుందన్నారు. అలాగే సోలర్ పలకలు ఏర్పాటు చేసిన ఐదేళ్ల వరకు గ్యారంటీ ఉంటుందన్నారు. ఈలోపు చిన్న పాటి సమస్య ఉన్నా, ఏర్పాటు చేయించిన కంపెనీనే ఉచితంగా సర్వీసు మెయింటెనెన్స్ చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు తప్పకుండా పీఎంఎస్‌జీవై ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజరు చలపతి, డీఈ వెంకటేశ్వర్లు, సబ్ ఇంజ నీర్లు స్రవంతి, వల్లూరు ఏఈ లావణ్య, స్టెప్ మేనేజరు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు మార్చి ఉద్యోగాలను ప్రశ్నార్థకం చేస్తున్నారు

- జేఎన్టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆవేదన

పులివెందుల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడూ లేని విధంగా కాంట్రాక్ట్ అగ్రిమెంట్‌లో నిబంధనలు మార్చి తమ ఉద్యోగాలను ప్రశ్నార్థకం చేస్తున్నారని పులివెందుల జేఎన్టీయూలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం తమ సమస్యపై స్థానిక కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. గత పదిహేను సంవత్సరాలుగా కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న తమకు ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా ప్రతి ఏడాది సర్వీసును పునరుద్ధరించేవారన్నారు. అయితే ఈ ఏడాది ఇంటర్వ్యూలు నిర్వహించి యదావిధిగా మా సర్వీస్‌ను పునరుద్ధరించారన్నారు. అయితే ఈనెల 16వ తేదీ కొత్తగా పలు అంశాలను చేర్చి పునరుద్దరించుకోవాలని చెబుతున్నారన్నారు. కొత్తగా ఇచ్చిన అగ్రిమెంట్‌లో వేకెంట్ పొజిషన్‌లో తీసుకోవడం లేదని, ఎటువంటి సమాచారం లేకుండా సర్వీస్ నుంచి తొలగించే హక్కు వారికి ఉన్నట్లు పొందుపరిచారన్నారు. ఎలాంటి అన్యాయం జరిగినా పెద్దలను గాని, న్యాయస్థానాలను గాని ఆశ్రయించకూడదని పొందుపరిచారన్నారు. ఈనిబంధనలు తమకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రిన్సిపాల్ ఏమన్నారంటే..

కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలపై పులివెందుల జేఎన్టీయూ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అగ్రిమెంట్ చేసుకోవాలని చెప్పామన్నారు. మీ ఉద్యోగ భద్రతకు భంగం కలగదని వివరించామన్నారు. జేఎన్టీయూ పరిధిలో అనంతపురం, పులివెందుల, కలికిరి కళాశాలలు ఉన్నాయని, కేవలం పులివెందులలో మాత్రమే ఇలాంటి నిరసన వ్యక్తమవుతోందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు ముందుకెళ్తామన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

జమ్మలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటలో 18వ తేదీ బుధవారం ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. మంగళవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పాఠశాలల యజమానులు, ఎంఈవోలు, మండల మహిళా సమాఖ్య, ఆర్టీసీ, తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని భారత ప్రధాని నరేంద్రమోడీ ఈనెల 21వ తేదీ శనివారం వైజాగ్‌లో పాల్గొంటున్న సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గండికోటలో ఏర్పాట్లు పూర్తయ్యాయని... నియోజకవర్గంలోని ప్రజలు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కాగా, జమ్మలమడుగు నుంచి ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు కూటమి నాయకులు తెలియజేశారు.

అయిదుగురు మట్కా నిర్వాహకుల అరెస్టు

జమ్మలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని అలంకార్ ఫంక్షన్ హాలు వద్ద మట్కా నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. రాబడిన సమాచారం మేరకు సీఐ లింగప్ప, ఎస్ఐ హైమావతి, సిబ్బంది దాడి చేసి మట్కా ఆడుతున్న వారిని అదుపులోకి తీసు కున్నారు. వారి వద్ద నుంచి రూ.1,39,000లు నగదుతో పాటు మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జమ్మలమడుగు పట్టణంలో కానీ, గ్రామాల్లో ఎక్కడైనా మట్కా నిర్వహిస్తున్నా, పేకాట ఆడుతున్నా సమాచారం ఇవ్వాలన్నారు. అలాంటి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ తెలిపారు.

నూనెపంటల సాగుకు ప్రోత్సాహం

- ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి



సాగులో ఉన్న పామాయిల్ చెట్లను చూపుతున్న శ్రీనివాసులరెడ్డి

పోరుమామిళ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నూనె గింజల పంట సాగు చేపట్టేందుకు ఉద్యానశాఖ రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు పోరుమామిళ్ల డివిజన్ ఉద్యానవనశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పామాయిల్ సాగు చేపట్టే రైతులకు హెక్టారుకు ఉచితంగా దాదాపు 29వేలు విలువ కలిగిన మొక్కలను అందజేస్తామన్నారు. అలాగే పంటసాగుకు రూ21 వేలు రాయితీ రూపంలో అందిస్తారన్నారు. పంట తొలి దశలో స్వల్పకాలిక కూరగాయ, పప్పుధాన్య పంటలను అంతర పంటలుగా సాగు చేసుకుంటే... అంతర పంటల సాగుకు సంవత్సరానికి రూ.5250 చొప్పున నాలుగు సంవత్సరాల్లో మరో 21వేల రూపాయలు ప్రభుత్వం రాయితీ రూపంలో అందిస్తుందన్నారు. అదనంగా పంట పొలానికి ఏపీ సూక్ష్మ నీటిపారుదల పథకంలో భాగంగా 90 నుంచి 70 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు అందిస్తుందన్నారు. పొలంలో నీటి వనరుల నిర్వహణ కోసం ఫారంపాండ్ నిర్మాణం చేపడితే మరో రూ.75వేలు రాయితీ ఉంటుందన్నారు. ఇక పండిన పంటను ప్రభు త్వంతో ఒప్పందం కుదుర్చుకుంటే.. కంపెనీనే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు నేరుగా కొనుగోలు చేస్తుందన్నారు. పంట నాటిన నాలుగో సంవ త్సరం నుంచి కోతకు వచ్చి దాదాపు 30 సంవత్సరాల వరకు పంట ఉంటుందన్నారు. వివరాలకు రైతులు రైతు సేవా కేంద్ర సహాయకులకు కానీ, ఉద్యానశాఖాధికారికి కానీ సంప్రదించాలని తెలిపారు.

ఐదుగురు కోడిపందెం రాయుళ్లు అరెస్టు

పులివెందుల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండలంలోని పుత్రాయునిపేట గ్రామ సమీపంలోని పొలాల్లో కోడిపందేలు ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు. మంగళవారం సాయంత్రం పుత్రాయునిపేట సమీపంలోని పొలాల్లో కోడిపందేలు ఆడుతున్నారని సమాచారం అందిన సీఐ తన సిబ్బందితో వెళ్లి ఐదుగురిని అరెస్టు చేశారన్నారు. వారి వద్ద నుంచి రూ.56,350 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

అదుపు తప్పి కాలువలోకి.. దూసుకెళ్లిన కారు



డ్రైనేజీ కాలువలో పడిన కారును బయటకు తీస్తున్న స్థానికులు

జమ్మలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో మంగళవారం సాయంత్రం ఓ కారు అదుపుతప్పి డ్రైనేజీ కాలువలోకి దూసుకెళ్లింది. మున్సిపాలిటీ పరిధిలోని మెయిన్ పోస్టాఫీసుకు వెళ్లే దారిలో ఉన్నట్లుండి ఓ కారు డ్రైనేజీ కాలువలోకి దూసుకు వచ్చింది. ఈ సమయంలో ఎదురుగా ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే స్థానికులు కారును బయటకు తీయడంతో కారులోని వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు

పులివెందుల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జీపుల స్టాండ్ పరిసరాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, బహిరంగ మద్యం తాగినా కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ చాంద్ బాష హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం జీపుల స్టాండ్ వద్ద డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల జీపు స్టాండ్ పరసరాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, బహిరంగ మద్యం తాగుతున్నారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారు ఎవరైన సరే తమకు ఫిర్యాదు చేయాలని ఆయన పేర్కొన్నారు.

రైతులకు బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఏపీ సీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా 46వేల మంది రైతులకు పెండింగ్‌లో ఉన్న రూ.1018 కోట్లు బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ సీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పశ్చిమ గోదారి జిల్లాలో రూ.296 కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.256 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాలో రూ.131కోట్లు, మిగతా అనేక జిల్లాలో పెండింగ్ బకాయిలు ఉన్నాయన్నారు. జొన్నలకు రూ.76 కోట్లు, రాగులకు రూ.33లక్షలు పెండింగ్ ఉన్నాయని వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సూపర్ సిక్స్ హామీలు 85శాతం అమలు చేశామని కొందరు టీడీపీ నాయకులు అనడం విడ్డూరమన్నారు. సంవ త్సరంలో పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, తల్లికి వందనం మాత్రమే అమలు చేశారన్నారు. నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ముస్లిం మైనార్టీలకు 50ఏళ్లకే పింఛన్, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి పథకాలు అమలు కాలేదన్నారు. అప్పుడే 85శాతం అమలు అయ్యాయని చెప్పడం కరెక్ట్ కాదన్నారు.

4 వారాంతపు ప్రత్యేక రైళ్లు.. మార్చి వరకు పొడిగింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి-నర్సపూర్, జాల్నా- తిరుపతి మార్గాల్లో నడుస్తున్న 4 వారాంతపు ప్రత్యేక రైళ్లను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు దాకా పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. చర్లపల్లి-నర్సపూర్ మార్గంలో నడిచే (07233/07234) ప్రత్యేకరైళ్లు మార్గమధ్యంలో నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయి. అలాగే, జాల్నా-తిరుపతి మార్గంలో నడిచే (07609/07610) ప్రత్యేక రైళ్లకు మార్గమధ్యంలో పార్బూర్, సేలు, మాలావత్, పర్బానీ, గంగాకేర్, పర్లి, వైజనాథ్, లాతూర్, ఉద్గిర్, బీదర్, మార్పల్లి, వికారాబాద్, లింగంపల్లి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్ట్ ఉంటుందని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం

లింగాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పట్ల గ్రామంలో మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు పడి మూడు ఎకరాల అరటితోట దగ్ధమైంది. దీనికి డ్రిప్ ల్యాడర్ మొత్తం దగ్ధం కావడంతో రైతు యుగంధర్‌రెడ్డికి రూ.4 లక్షలు నష్టం వాటిల్లింది. ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలు వ్యాపించకుండా అదుపుచేశారు.

నో క్యాష్... నో క్యాష్

- నర్సాపురం ఏపీజీబీలో అందుబాటులో లేని నగదు
- ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు



నర్సాపురంలోని ఏపీజీబీ

కాశినాయన జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నర్సాపు రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో నగదు అందుబాటులో ఉంచకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే మారుమూల మండలం... ఉన్నది ఒకే ఒక బ్యాంక్... నెలలో నాలుగైదు రోజులు మినహా ఎప్పుడు బ్యాంక్‌కు వెళ్లినా అక్కడ సిబ్బంది చెప్పే మాటలు నో క్యాష్. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కో విద్యార్థికి రూ.13000 చొప్పున బ్యాంక్‌లో జమ చేసింది. మరోవైపు రెండు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల డబ్బును విడుదల చేసింది. శని ఆదివారాలు బ్యాంక్‌కు సెలవు కావడంతో సోమ, మంగళవారం బ్యాంక్‌లో రద్దీ పెరిగింది. నగదు కోసం విద్యార్థుల తల్లులు, ఉపాధి కూలీలు బ్యాంక్‌లో క్యూకట్టారు. కానీ అక్కడి సిబ్బంది ముందు చూపుతో నగదు తెచ్చిపెట్టుకోవాల్సింది పోయి యదావిధిగా వచ్చిన వారికి కరోనా సమయంలో చెప్పినట్లు నగదు లేదు అనే రొటీన్ సమాధానమే చెప్పడంతో పలువురు ఖాతాదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఖాతాదారుల కనీస అవసరాలకు డబ్బును సర్ధుబాటుచేయకపోతే ఇక బ్యాంక్ ఉండి ఏమి ఉపయోగమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రతినెల 10వ తేదీ వరకు డ్వాక్రా మహిళలు చెల్లించే డబ్బుతో బ్యాంక్‌ను అతికష్టం మీద నడిపిస్తూ వస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా బ్యాంక్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సరిప డు నగదు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు. ఈవిషయంపై బ్యాంక్ మేనేజరు ఇంద్రాణిని వివరణ కోరగా.. నగదు అందుబాటులో లేదన్న విషయం వాస్తవమేనని చుట్టుపక్కల బ్యాంక్ వాళ్లు ఎవరని అడిగినా నగదు ఇవ్వడం లేదన్నారు. దూరప్రాంతనికి పోయి తెచ్చుకుందామంటే ఇబ్బందిగా ఉందన్నారు. ఈవిషయం పైఅధికారులకు కూడా చెప్పానన్నారు.



చాపాడు చానెల్ కాలువ

కేసీ నీటి కోసం...

చాపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో కేసీ కెనాల్ సాగునీటికోసం రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రతి ఏడాది జూన్, జూలై నెలల్లో ఖరీఫ్ పంటలు సాగు చేస్తారు. తొలకరి వానలు కురవగానే భూముల్లో దుక్కులు దున్ని పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతారు. ప్రొద్దుటూరు, చాపాడు, దువ్వూరు, మైదుకూరు, ఖాజీపేట మండలాల్లోని భూములకు ప్రధాన జలవనరు కేసీ కెనాల్ సాగు నీరు. మిగిలిన భూములకు వ్యవసాయ ఫిల్టర్లు, బోరుబావులు ప్రధాన ఆధారం. ఈ ఏడాది జూన్ నెల రాగానే రైతులు ఆనందంతో పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి సాగునీరు కేసీ కెనాల్‌కు దాని ఉప కాలువలు అయిన చాపాడు చానెల్, ఏటూరు కాలువలకు అధికారులు నీటిని విడుదల చేస్తారు. ప్రస్తుతం వర్షాలు ఇప్పటికి ఆశించిన స్థాయిలో కురవలేదు. అరకొర వర్షాలు పడడంతో రైతులు దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు. జిల్లాల్లో అన్ని మండలాల్లో కన్నా చాపాడు మండలంలో వరి పైరు ఎక్కువగా సాగు చేస్తారు. ప్రతి ఏడాది సుమారు 26 వేల ఎకరాల్లో వరి, పసుపు 600 ఎకరాల్లో, వేరుశనగ 5 వేల ఎకరాల్లో సాగు చేస్తారు. ప్రొద్దుటూరు మండలంలో సుమారు 5 వేలు, దువ్వూరులో 10 వేల ఎకరాలు, మైదుకూరు, ఖాజీపేట మండలాల్లో 12 వేల ఎకరాల చొప్పున వరి పైరు సాగు చేస్తారు. ఈ మండలాల్లోని రైతులు వరి సాగుకు ముందు పచ్చిరొట్టగా ఉపయోగించే జీలుగ విత్తనాలకోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు అందజేయాలని కోరుతున్నారు. వరి విత్తనాల కోసం నెల్లూరు, నంద్యాల, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళుతున్నారు. రైతులు ఎక్కువగా జిలకర, నెల్లూరు, 999, నంద్యాల, జైశ్రీరాం వంటి రకాలను సాగు చేస్తారు. ప్రతి రోజు మేఘాలతో మబ్బులతో ఊరిస్తోంది తప్ప వర్షం కురవడం లేదు. వర్షం కురిసి కేసీకి సాగునీరు విడుదల చేస్తే పంటలు సాగు చేయవచ్చని రైతులు ఆశగా ఉన్నారు. జూన్, జూలై నెలలు మంచి అదును కాలం. ఈ కాలంలో పంటలు సాగు చేస్తే ఎక్కువగా దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. అందువలనే ఈ సమయంలోనే పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

సాగునీటిని విడుదల చేయాలి



ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్ని గ్రామాల రైతులు పంటలు సాగు చేస్తారు. జూన్ లేదా జూలై నెలలు పంటలు సాగుకు అనుకూలం. ప్రస్తుతం కేసీ కెనాల్‌కు సాగునీటిని విడుదల చేస్తే ఎక్కువ మంది రైతులు వరి సాగు చేస్తారు. ప్రభుత్వం ఆ ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

- అస్తాన్, రైతు, గుంత చీపాడు గ్రామం

సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి



ప్రభుత్వం సబ్సిడీకి వరి, వేరుశనగ విత్తనాలు అందజేయాలి. జూన్ లేదా జూలై నెలలు పంటలు సాగు చేసేందుకు మంచి అదును. ఈ కాలంలో పంటలు సాగు చేస్తే ఎక్కువగా దిగుబడి వస్తుంది. అధికారులు విత్తనాలు అందజేసేందుకు చర్యలు చేపట్టాలి.

- సుభద్ర, మహిళా రైతు, కేతవరం గ్రామం

వైసీపీలో చేసిన అభివృద్ధి ఏమి ...?

● పాలకవర్గంపై టీడీపీ నేతల ధ్వజం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

మదనపల్లె టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో వున్న మూడున్నరేళ్లలో మున్సిపల్ పాలకవర్గం చేసిన అభివృద్ధి చూపాలని టౌన్‌బ్యాంకు ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ ప్రశ్నించారు. స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో టీడీపీ నేతలు, మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైసీపీ నేతలపై మండిపడ్డారు. ఏడాది పాలనలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా రూ.40కోట్ల దాకా అభివృద్ధి పనులు చేపట్టారని, అవి వైసీపీ నేతల కళ్లకు కనపడటం లేదా అని ప్రశ్నించారు. ఇంజనీర్‌గా పనిచేసిన నిస్సార్‌అహ్మద్ కాంట్రాక్టర్ల వద్ద కమిషన్లు తీసుకున్నది మరచిపోయారా అని గుర్తుచేశారు. టీడీపీ నేత బాలుస్వామి మాట్లాడుతూ నిషేధిత భూముల వివరాలు తెలుసుకుని వైసీపీ పెద్ద వేలాది ఎకరాల భూములను బెదిరించి వారి పేరు మీద రాయించుకోలేదా...ఈ అవినీతి బయటపడుతుందని సబ్ కలెక్టరేట్‌లో ఫైల్స్ దహనం చేశారని ఆరోపించారు. సుధాకర్, నీలకంఠ, ఎస్ఎం రఫి, షంషీర్, నాదెళ్ల శివన్న, జాన్‌బాబు, జోలెపాలెం చిన్ని, కత్తిలక్ష్మన్న, సర్పంచ్ ప్రభాకర్, తలారి రాధ, పులిమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విశేష కృషి

బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎంకు సన్మానం



బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం పద్మలతను సన్మానిస్తున్న దృశ్యం

తంబళ్లపల్లె, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్లగా పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషిచేసిందని హెచ్‌ఎం పద్మలతను వక్తలు కొనియాడారు. రెడ్డివారిపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బదిలీపై వెళ్తుండడంతో స్థానిక టీడీపీ నేతలు, విద్యార్థుల తల్లితండ్రులు హెచ్‌ఎంను ఘనంగా సన్మానించారు. టీడీపీ గ్రామాధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో హెచ్‌ఎంను దుశ్శాలువ, పూలమాలలతో సన్మానించి విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. సురేంద్ర మాట్లాడుతూ హెచ్‌ఎం పాఠశాలలో అనేక మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి ఉన్నతికి బాటలు వేసిందన్నారు. అనంతరం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మెన్ బాలరాజు, టీడీపీ నాయకులు సోము, ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్

పీలేరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే ప్రతి విద్యార్థి లక్ష్యం ఉన్నతంగా ఉండాలని కేవీపల్లె మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ముంగర రెడ్డిప్రదీప్ తెలిపారు. 12 ఏళ్లగా కేవీపల్లె మోడల్ పాఠశాలలో టీచర్‌గా, ప్రిన్సిపాల్‌గా పనిచేసి బదిలీపై వెళుతున్న ప్రిన్సిపాల్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లదండ్రులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థి దశ జీవితంలో మరుపురాని మజిలీగా నిలిచిపోతుందని, ఇక్కడ ఎంచుకున్న లక్ష్యం దిశగా చదువులో రాణిస్తే భవిత బంగారమౌతుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

విద్యార్థి సంఘాల నేతల డిమాండు ● తహసీల్దార్‌కు వినతి పత్రం



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు

కలకడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పిల్లలకు పురుగుపట్టిన బియ్యంతో భోజనం తయారు చేయిస్తున్న ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మలాంషావలిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేసిన వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం నాణ్యమైన బియ్యం సరఫరా చేసిన పురుగులు పట్టిన బియ్యం ఎందుకు వాడినట్లు ప్రశ్నించారు. విద్యార్థులకు పోషకాహారంగా సరఫరా చేస్తున్న గుడ్లు, చిక్కీలు సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశాలున్నా నిల్వ ఉంచి పడేస్తున్నట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం, పిల్లలకు హక్కులకు భగం వాట్లితోందన్నారు. అనంతరం తహసీల్దార్ మహేశ్వరి భాయికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ అమృత్‌తేజ, చంద్రబాబునాయుడు, భాను, సాయి, లతీఫ్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి పరిశీలకుడుగా రాటకొండ మధుబాబు



సీఎం చంద్రబాబుతో రాటకొండ

మదనపల్లె, జూన్ 17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబు నియమితులయ్యారు. అధిష్టానం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపిన ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీని మరింత బలోపేతం చేసి సంస్థాగత ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే షాజాహాన్ బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. మధుబాబు నియామకం పట్ల పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ నేతలు గండికోట గణేష్‌బాబు శుభాకాంక్షలు తెలియచేశారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు



మృతదేహాన్ని తీసుకెళుతున్న ఫౌండేషన్ సభ్యులు

పీలేరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అనాథ వృద్ధురాలికి మేము సైతం ఫౌండేషన్ సభ్యులు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక ఎల్‌బీఎస్ రోడ్డు, ఆంధ్రా బ్యాంకు సమీపంలో దుర్గ అనే పేద వృద్ధురాలు ఉండేది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మంగళవారం ఉదయం కన్ను మూసింది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో అంత్యక్రియల విషయంలో మీమాంస నెలకొంది. విషయం తెలుసుకున్న మేము సైతం ఫౌండేషన్ సభ్యులు, సొంత ఖర్చులతో, సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా సహకారంతో హిందూ సంప్రదాయంలో అంత్యక్రియలు నిర్వహించారు. వారి సేవను పలువురు స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో ఫౌండర్ షేక్ షాహింషా, ఉపాధ్యక్షులు షఫీ, హసన్ బాషా, ఆదిల్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్ల పంపిణీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా





జడ్పీహైస్కూల్ విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా - నల్లగుట్ట ప్రాథమిక పాఠశాలలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే కాక, విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పాలన అందిస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీహైస్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లను ఎమ్మెల్యే విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 13,026 మందికి స్కూల్ కిట్లు (స్కూల్ బ్యాగ్, యూనిఫాం, బెల్టు, షూస్) పంపిణీ చేస్తున్నామన్నారు. జడ్పీహైస్కూల్ వందేళ్లుగా లక్షలాది మందికి విద్యాబుద్ధులు నేర్పిందని, ఇప్పుడు ఇక్కడ విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం బాధాకరమన్నారు. వచ్చే విద్యాసంవత్సరం టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, లేకుంటే బదిలీ చేసుకుని వెళ్లిపోవాలని సూచించారు. డీవైఈఓ లోకేశ్వరరెడ్డి మాట్లాడుతూ మదనపల్లె జడ్పీహైస్కూల్‌పై ప్రత్యేక దృష్టి పెడతామని నాణ్యమైన బోధన అందించి ఉత్తీర్ణత శాతం పెంచుతామన్నారు. ఎంఈఓ-2 రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలను పరిష్కరించాలి

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సొసైటీ కాలనీలో మురుగునీటి కాల్వల వ్యవస్థ దెబ్బతినడంపై క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే పరిశీలించారు. సమస్య చిన్నదిగా వున్నపుడే పరిష్కారం చూపితే పెద్దసమస్యగా మారదన్నారు. కమిషనర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త వెంకటరమణ మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెంకటరమణ భౌతికకాయం వద్ద నివాళులర్పించి, అంత్యక్రియల కోసం రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు.

సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

వాల్మీకిపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విద్య, ఆరోగ్యం, సంక్షేమం పూర్తిగా సీఎం నారా చంద్రబాబుతోనే సాధ్యమని వాల్మీకిపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేపట్టిన ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పాఠశాలల పేరుతో వేలకోట్ల ప్రభుత్వ నిధులు అన్యాక్రాంతమయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వం రాష్ట్రంలో నిరుపేద ప్రజల సంక్షేమం అంతకంటే ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పన, పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసే దిశగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పిల్లలకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, స్కూల్ కమిటీ ఛైర్మన్ కిట్ట, నేతలు రాజేంద్రాచారి, పీవీ నారాయణ, బొక్కసం బ్రదర్స్, మురళి, కేకేనాయుడు, పునుగుపల్లె సదా, సాంబశివ, డిష్ బ్రదర్స్, రైల్వే రామచంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్హులందరికీ తల్లికి వందనం

పీలేరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ తల్లికి వందనం పథకంలో భాగంగా రూ. 15 వేలు నగదు తల్లుల ఖాతాలో జమ చేసిందని టీడీపీ యువనేత, పీలేరు ఆర్టీసీ ఈయూ డిపో గౌరవాధ్యక్షుడు శ్రీనాథరెడ్డి తెలిపారు. ఆర్టీసీ నల్లగుట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో సీఎం నారా చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. జగన్ జమానాలో కేవలం ఇంటికి ఒక్కరంటూ అందరినీ మోసం చేసిందని విమర్శించారు. కేవలం ఉనికిని చాటుకోవడం కోసం ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనం పథకంలో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ అమలు చేయడం ప్రభుత్వానికే సాధ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ చేర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో ప్రయోజనాలు మెండు

అవగాహన కల్పించిన ఈఈ చంద్రశేఖర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ చంద్రశేఖర్ రెడ్డి

కలకడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇళ్లపై కృత్రిమంగా విద్యుత్‌ను సృష్టించే సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుతో పలు ప్రయోజనాలు కలుగుతాయని ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. 'సూర్యఘర్'పై కలకడ వినియోగదారులకు అవగాహన కల్పించిన ఈఈ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రూ.78 వేల కోట్లతో కోటి ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేసినట్లు తెలిపారు. దీంతో భవిష్యత్‌లో వాతావరణ కాలుష్యం, నాణ్యమైన విద్యుత్‌ను పొందవచ్చన్నారు. రాయితీ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ ప్రశాంత్ మాట్లాడుతూ లబ్ధిదారులకు అందే సదుపాయం, కాలవ్యవధి, వడ్డీశాతం గురించి వివ రించారు. కార్యక్రమంలో ఏడీ శివయ్య, ఏఈ అరుణ్, నాయకులు శేఖర్ నాయుడు, తారకేశ్వర, జిలానీ, ఇర్ఫాన్, జాఫర్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం సోలార్‌ను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ గంగాధర్

నిమ్మనపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో డీఈ గంగాధర్ అన్నారు. స్థానిక ఎస్‌వీఆర్ ఫక్షన్‌హాల్లో గ్రామస్తులకు సోలార్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కుంటుబాలకు ఉచితంగా సోలార్ ప్యానెళ్లను వారి ఇంటిపై బిగించి విద్యుత్ ఉపయోగాన్ని బట్టి బిల్లు చార్జి చేస్తారన్నారు. ఇందులో మిగులు విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేసుకుంటుందన్నారు. మిగిలిన కేటగిరీలకు సబ్సిడీతో సోలార్ విద్యుత్‌ను అందిస్తామని వీరికి బ్యాంకుల ద్వారా ఋణాన్ని మంజూరు చేయిస్తామన్నారు. కుటుంబాల సామర్థ్యాన్ని బట్టి 1 కిలో వాట్స్ నుంచి 10 కిలో వాట్స్ వరకు విద్యుత్‌ను ఉపయోగించు కోవచ్చని తెలిపారు. ఏడీఏ సురేంద్రనాయక్, ఏఈ నాగరాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పథకాలను వర్తింపజేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, జూన్ 17 (ఆంధ్ర జ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని యూనియన్ అధ్యక్షురాలు మధురవాణి కోరారు. తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని, కనీస వేతనం కూడా అందడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమకు ప్రభుత్వ పథకాలను తొలగించడం బాధకరమన్నారు. ప్రభుత్వం పునరాలోచించి అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గంగాదేవి, విజయ, మంజుల, పుష్పావతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు విడుదల చేయాలి'

రైల్వేకోడూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన, వర్గాల విద్యార్థులు ఉన్నత చదువు ఆశాజ్యోతి అయిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సర్వేపల్లి నరసింహ డిమాండ్ చేశారు. రైల్వేకోడూరులో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంకాం ఉన్నత వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లతీఫ్, మదన్మోహన్, దివన్, విజయ్, శ్రీనివాసులు, మదన్‌సాయి, పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పరిపాలనలో ఎనలేని అభివృద్ధి

పుల్లంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ అధికారం చేపట్టి 11 ఏళ్లు పూర్తైందని దేశవ్యాప్తంగా ఎంతో అభివృద్ధి చెందిందని, జిల్లా కోకన్వీనర్ తోట శ్రీనివాసులు అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని ఐదు మండలాల బీజేపీ అధ్యక్షులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ 11 ఏళ్ల బీజేపీ పాలనలో సేవా సుపరిపాలన పేదల సంక్షేమం, గ్రామీణ పట్టణాల్లో జరిగిన అభివృద్ధిపై 19 నుంచి మండలాల వారీ ప్రజలకు తెలియజేసే కార్యక్రమం చేపట్టామన్నారు. బీజేపీ పాలన దేశానికి అమృత కాలం అన్నారు. 19న రైల్వేకోడూరు, 20న ఓబులవారిపల్లె, 21న పెనగలూరు, 22న ఉదయం పుల్లంపేట, సాయంత్రం చిట్వేలిలో నరేంద్రమోదీ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరింస్తామన్నారు. కార్యక్రమాలను నేతలు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు అమలాపురం మనోహర్‌రెడ్డి, రూపేష్‌రెడ్డి, సాయం శ్రీధర్, కొండేటి రెడ్డి క్రిష్ణరాయల్, బాహుజీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం



రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తున్న నేతలు

తంబళ్లపల్లె, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రైతున్నలకు వెన్నుదన్నుగా ప్రభుత్వం ఉందని రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు, కన్నెమడుగు టీడీపీ గ్రామాధ్యక్షుడు సురేంద్ర అన్నారు. ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి సూచనల మేరకు మంగళవారం గ్రామాధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో కన్నెమడుగు సహా పలు రైతు సేవా కేంద్రాల్లో నేతలు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. రైతులందరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు వెంకట్రమణ, టీడీపీ గ్రామ ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి, సోము, యువనేత బాలరాజు, వీఏఏ రత్నమాలిక, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పెద్దమండ్యం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వర్షకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పెద్దమండ్యం పీహెచ్‌సీ డాక్టర్ ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. జ్వరాలు సోకకుండా రాత్రిళ్లు దోమ తెరలు వాడాలన్నారు. ఇంట్లో వున్న నీటి తొట్టెలపై మూతలు పెట్టాలన్నారు. పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవాలన్నారు. దగ్గు, జలుబు, జ్వరం సోకిన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సకాలంలో మందులు పంపిణీ చేయాలన్నారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పర్యటించి ప్రజల ఆరోగ్య పరిస్థితుల వివరాలను డాక్టర్లకు దృష్టికి తీసుకురావాలన్నారు. సీహెచ్ఓ క్రిష్ణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టండి

పెద్దమండ్యం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని పెద్దమండ్యం ఎంఈఓ-1 మనోహర్ పేర్కొన్నారు. కోటగుట్టపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన ఎంఈఓ మాట్లాడుతూ బడి ఈడుపిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ ఉచిత పథకాలు విద్యసేవలు అమలుపై తల్లిదండ్రులకు వివరించాలన్నారు. తల్లికి వందనం, సర్వేపల్లి రాధకృష్ణ విద్యా కిట్టు వివరాలను తెలియజేయాలన్నారు. విద్యార్థుల్లో విద్యాసామర్థ్య తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం రమణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ డీటీగా ఫణికుమార్

గుర్రంకొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా ఫణికుమార్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డీటీ బాబాజాన్ పదోన్నతిపై బి.కొత్తకోట తహసీల్దార్‌గా వెళ్లారు. ఈ క్రమంలో కలకడ నుంచి బదిలీపై గుర్రంకొండలో బాధ్యతలను చేపట్టారు.

బాధితుడికి స్నేహితుల అండ



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న స్నేహితులు

ములకలచెరువు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితుకి స్నేహితులు అండగా నిలిచారు. కదిరినాధునికోట పంచాయతీ కాశీపల్లెకు చెందిన జేసీబీ రామూర్తి రెండు నెలల కిందట రోడ్డు ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లిన ఆయన ప్రస్తుతం ఎవరినీ గుర్తుపట్టలేని స్థితిలో ఇంట్లో ఉన్నాడు. ఈ క్రమంలో స్థానిక జడ్పీ హైస్కూలో 1988-89లో టెన్త్ చదివిన తోటి విద్యార్థులు కలిసి రామూర్తి భార్య శోభారాణికి మంగళవారం రూ.50వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో తోటి స్నేహితులు ప్రతాప్‌కుమార్, కృష్ణా, సయ్యద్‌బాషా, మస్తాన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ హయాంలో వడ్డెర్లకు ఉపాధి కరువు'

రాయచోటిటౌన్, జూన్17(ఆంధ్రజ్యోతి): వైసీపీలో వడ్డెర్లకు ఉపాధి కరువైందని వడ్డెర ప్రజాగళం వ్యవస్థాపక అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన వడ్డెర ప్రజాగళం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు నాగార్జునతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మైన్స్ డిపార్టుమెంట్‌లో ఉన్న ప్రత్యేక జీఓను తొలగించి ఉపాధి లేకుండా చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వడ్డెర సొసైటీలకు ఇస్తున్న రాయితీలతో కొంతమేర ఉపశమనం కలుగుతోందన్నారు.

మదనపల్లె ఏఓగా నవీన్



మదనపల్లె టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా నవీన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేయడం దాదాపు పూర్తి కావచ్చిందని, ఇంకా కొందరు రైతులు విత్తనాల కోసం అడుగుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ద్వారా వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బందితో ఖరీఫ్ రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

పశు వైద్యాధికారిగా విక్రంరెడ్డి

తంబళ్లపల్లె, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కన్నెమడుగు పశువైద్యశాల వైద్యాధికారిగా విక్రంరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సుజనశ్రీ కురబలకోట పశు వైద్యశాలకు బదిలీపై వెళ్లారు. దీంతో ఆమె స్థానంలో వెలిగల్లు పశువైద్యులుగా ఉన్న విక్రంరెడ్డి కన్నెమడుగుకు వచ్చారు. అంతేకాకుండా గుండ్లపల్లె పశువైద్యశాల ఇన్‌చార్జి పశువైద్యుడిగా అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు.

షష్టి పూర్తి సమ్మేళనానికి సిద్ధం

వాల్మీకిపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివిన షష్టిపూర్తి సమ్మేళనానికి సిద్ధం చేసుకుంటున్నారు. 1980లో టెన్త చదివిన విద్యార్థులు మంగళవారం కలిశారు. తమ బ్యాచ్ విద్యార్థులు ఈ ఏడాది షష్టిపూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఒక ప్రత్యేక అపూర్వ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించారు. జూలై 6న ఆదివారం పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని వివరించారు. అప్పటి విద్యార్థులు ఏ ప్రాంతంలో ఉన్నా ఈ కార్యక్రమానికి హాజరై మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకోవాలన్నారు. పూర్వ విద్యార్థులు అప్పళ్ల, సుబ్రహ్మణ్యం, రఘురాం, రామిశెట్టి మనోహర్, పీవీ నారాయణ, రాయదుర్గం శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గుర్రంకొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒకరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎల్లుట్లలో కొలువైన పాలేటమ్మ జాతరకు హాజరైన ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను టీడీపీ అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేదవానికీ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతలు మూర్తిరావు, జగదీష్, ఎల్లుట్ల మురళీ, సుబ్రమణ్యం, రఘు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ 'తల్లికి వందనం' ఇవ్వాలి

రాయచోటిటౌన్, జూన్17(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకాన్ని పేద దళిత, మున్సిపల్ కార్మికుల పిల్లలకు కూడా వర్తింపజేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సురేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. కమిషనర్ వాసుబాబుకు వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్పందించి పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు, స్కీం వర్లందరికీ తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. మున్సిపల్ కార్మిక సంఘం నేతలు శేషాద్రి, వెంకటేశ్, కేశవరావు, హరిప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సిబ్బంది కొరత

రైల్వేకోడూరు రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ వంటి కీలక పోస్టులు ఖాళీ అయ్యాయి. కాగా తహసీల్దార్ మహబూబ్ చాంద్ సుండుపల్లికి బదిలీ కాగా ఆమె స్థానంలో నిమ్మనపల్లి నుంచి అమర్నాథ్ విధుల్లో చేరారు. డిప్యూటీ తహసీల్దార్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు బదిలీపై వెళ్లగా ఇక్కడికి ఎవరినీ నియమించలేదు.